పుంజుకున్న రిజిస్ట్రేషన్ రాబడి



స్టాంపులు, రిజిస్ట్రేషన్‌శాఖ రాబడి పుంజుకుంది. గత ఏడాదితో పోలిస్తే ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో తొలి ఐదు నెలల కాలంలో వృద్ధిశాతం సైతం పెరిగింది. కొత్త ప్రభుత్వంపై నమ్మకం పెరగడంతో స్థిరాస్తి వ్యాపారం క్రమంగా ఊపందుకుంది. భూములు, స్థలాలపై ఎక్కువమంది పెట్టుబడులు పెట్టేందుకు ఇటీవలి కాలంలో ఉత్సాహం చూపుతున్నారు.

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఎనిమిది సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల ద్వారా ప్రభుత్వం ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు రాబడి లక్ష్యం రూ.90.54 కోట్లు నిర్దేశించగా రూ.64.17 కోట్లు సాధించి 70.87 వృద్ధి శాతం సాధించామని జిల్లా రిజిస్ట్రార్ వెంకటరమణ మూర్తి తెలిపారు. ఏప్రిల్‌లో రూ.17.45కోట్లకుగాను రూ.12.24 కోట్లు(70.15 శాతం), మే నెలలో రూ.15.27 కోట్లకు బదులు రూ.12.12 కోట్లు(79.41 శాతం), జూన్‌లో రూ17.45కోట్లకు బదులు రూ.13.79 కోట్లు(79.02 శాతం), జూలైలో రూ.22.91 కోట్లకు బదులు రూ.13.82 కోట్లు (60.32 శాతం) వసూలు జరిగిందని చెప్పారు. గత ఏడాది తొలి ఐదు నెలల కాలంలో రూ.57.35 కోట్లు మాత్రమే ఆదాయం వచ్చిందన్నారు. లక్ష్యంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలవారీగా కుప్పం రూ.9.27 కోట్లకు బదులు రూ.9.44 కోట్లతో 101.81 శాతం వృద్ధి సాధించి ప్రథమ స్థానంలో నిలవగా రెండో స్థానంలో చిత్తూరు రూరల్ రూ.6.46 కోట్లకు బదులు రూ.5.99 కోట్లు (92.74 శాతం), నగరి రూ.5.97 కోట్లకు రూ.5.53 కోట్లు (92.58శాతం), పలమనేరు రూ.14.49 కోట్లకు రూ.12.91 కోట్లు (89.10 శాతం), బంగారుపాళ్యం రూ.4.75 కోట్లకు రూ.3.64 కోట్లు (76.63శాతం), పుంగనూరు రూ.12.77 కోట్లకు రూ.7.99 కోట్లు (62.54 శాతం), కార్వేటినగరం రూ.4.51 కోట్లకు రూ.2.37 కోట్లు (52.49 శాతం) సాధించగా, చిట్టచివరి స్థానంలో చిత్తూరు (ఆర్వో) రూ.32.28 కోట్లకుగాను రూ.16.28 కోట్లు వసూలు చేసి 50.43శాతంతో వెనుకబడిందన్నారు. జిల్లాలో డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్లు ఇప్పటివరకు 23,976 జరగ్గా, కుప్పం 5574 జరిపి ప్రథమ స్థానంలో నిలవగా, 4136తో పలమనేరు, 3956తో చిత్తూరు ఆర్వో ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచాయన్నారు. 1364 డాక్యుమెంట్లతో చిట్టచివరిస్థానంలో నగరి నిలిచిందని వివరించారు.

2019 నుంచి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల వారీగా సాధించిన రాబడి వివరాలు

సంవత్సరం	వార్షిక లక్ష్యం (రూ.కోట్లలో)	లక్ష్య సాధన (రూ.కోట్లలో)	రిజిస్టర్ అయిన డాక్యుమెంట్లు	వృద్ధి శాతం
2019-20	84.01	63.48	42,843	75.56
2020-21	81.05	71.78	43,959	88.56
2021-22	108.49	101.67	74,692	93.71
2022-23	133.21	118.40	68,810	88.88
2023-24	181.78	144.50	86,622	79.49
2024-25	221.88	149.88	60,656	67.55
2025-26 (ఆగస్టువరకు)	90.54	64.17	23,976	70.87

'స్థానిక' సమరానికి తాత్కాలిక షెడ్యూల్

● విడుదల చేసిన రాష్ట్ర ఎన్నికల సంఘం

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): గడువులోపు స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించడానికి రాష్ట్ర ఎన్నికల సంఘం తాత్కాలిక షెడ్యూల్‌ను విడుదల చేసింది. గ్రామ పంచాయతీ పాలకుల పదవీకాలం 2026 మార్చి, ఏప్రిల్‌లో ముగియనుంది. ఐదేళ్ల పదవీకాలం పూర్తయ్యేందుకు మూడు నెలల ముందుగానే ఎన్నికల ప్రక్రియ పూర్తిచేయాలి. ఇందులో భాగంగా ఎన్నికల సంఘం స్థానిక సమరానికి సిద్ధమైంది.

షెడ్యూల్ ఇలా.. : తాత్కాలిక షెడ్యూల్ ప్రకారం అక్టోబరు 15వ తేదీలోపు వార్డుల పునర్విభజన, రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తిచేయాలి. అక్టోబరు 16 నుంచి నవంబరు 15వ తేదీలోగా వార్డులవారీగా ఓటర్ల జాబితాలు సిద్ధంచేసి ప్రచురించాలి. నవంబరు ఒకటి నుంచి 15వ తేదీలోపు ఎన్నికల అధికారుల నియామకం, 16-30లోగా పోలింగ్ కేంద్రాల ఖరారు, బ్యాలెట్ పెట్టెల మరమ్మతులు చేయించాలి. ఒకవేళ ఈవీఎంలతో ఎన్నికలు నిర్వహించాలని ప్రతిపాదిస్తే, కొత్తవి కొనుగోలు చేసి వాటి మొదటిస్థాయి తనిఖీలు చేయాలి. డిసెంబరు 15 లోపు రిజర్వేషన్లు ఖరారు చేయాలి. చివరివారంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించాలి. 2026 జనవరి చివరిలో లేదా ఫిబ్రవరి మొదటి వారంలో ఎన్నికల ప్రకటన జారీచేసి వెనువెంటనే పోలింగ్, ఫలితాలు ప్రకటించాలి. రాష్ట్ర ప్రభుత్వం రిజర్వేషన్లు ఖరారుచేసిన తర్వాతే ఎన్నికల సంఘం షెడ్యూలు విడుదల చేయనుంది. ఈ పదవులపై ఆశలు పెట్టుకున్న ఔత్సాహికులు అప్పుడే గ్రామాల్లో పావులు కదిపే ప్రయత్నాలు మొదలెట్టారు.

సీపీఎస్ ఉద్యోగులకు తీపి కబురు

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సీపీఎస్ (కాంట్రీబ్యూటరీ పెన్షన్ స్కీమ్) ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. వారి మొదటి డీఏ బకాయిలను సోమవారం విడుదల చేసింది. జిల్లాలో సుమారు 30వేల మంది సీపీఎస్ ఉద్యోగులు 2004 సెప్టెంబరు 1 నుంచి పనిచేస్తున్నారు. ప్రభుత్వ నిర్ణయం మేరకు ఒక్కో ఉద్యోగికి సుమారు రూ.40వేల నుంచి రూ.70వేల వరకు బకాయిలు విడతలవారీగా వారి బ్యాంకు ఖాతాలకు జమ చేస్తుంది. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై జిల్లా ఎన్జీవో సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్ష, కార్యదర్శులు కేవీ రాఘవులు, బాలసుబ్రహ్మణ్యం, రమేష్, సీపీఎస్ ఉద్యోగుల జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు షమీర్, దేవానంద్ హర్షం తెలిపారు.



యాళి వాహనంపై సిద్ధి, బుద్ధి సమేత వినాయకస్వామి

యాళి వాహనంపై గణనాథుడి చిద్విలాసం

ఐరాల(కాణిపాకం), సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కాణిపాకంలో నిర్వహిస్తున్న ప్రత్యేక ఉత్సవాల్లో భాగంగా సోమవారం యాళి వాహనంపై వరసిద్ధుడు విహరించాడు. ఈ కార్యక్రమానికి అగరంపల్లెకు చెందిన ఎ.నరసింహారెడ్డి కుమారులు, చిన కాంపల్లెకు చెందిన పి.సుబ్బారెడ్డి కుమారులు ఉభయదారులుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా ఉదయం మూల విరాట్‌కు అభిషేకం, చందనాలంకారం చేశారు. ఆలయాన్ని శోభాయమానంగా అలంకరించారు. రాత్రి ఉభయదారులు ఉభయ వరుస తీసుకురావడంతో అలంకార మండపంలో సిద్ధి, బుద్ధి సమేత వినాయకస్వామి ఉత్సవర్లకు పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవర్లను యాళి వాహనంపై అధిష్ఠింపజేసి, కాణిపాకం పురవీధుల్లో ఊరేగించారు. ఆలయ ఈవో పెంచలకిషోర్, ఏఈవో రవీంద్రబాబు, సూపరింటెండెంట్లు కోదండపాణి, వాసు, ఇన్‌స్పెక్టర్లు చిట్టిబాబు, బాలాజీనాయుడు, ఉభయదారులు పాల్గొన్నారు. ప్రత్యేక ఉత్సవాల్లో భాగంగా మంగళవారం సూర్యప్రభ వాహన సేవ జరగనుంది.

గ్రావెల్ దందాపై కలెక్టర్ సీరియస్

రెండు టిప్పర్లను సీజ్ చేసిన రెవెన్యూ, పోలీసు అధికారులు





వనదుర్గాపురం అడవిలో టిప్పర్లకు గ్రావెల్ నింపుతున్న పొక్లెయినర్లు - సీజ్ చేసిన రెండు టిప్పర్లు

పాలసముద్రం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పాలసముద్రం మండలంలోని వనదుర్గాపురం అడవిలో ఉన్న క్వారీ నుంచి తమిళనాడుకు గ్రావెల్‌ను అక్రమంగా తరలించే దందాను మూడ్రోజులుగా ప్రారంభించారు. దీనిపై కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు సోమవారం సమాచారం అందడంతో ఆయన సీరియస్ అయ్యారు. వెంటనే తహసీల్దార్ అరుణకుమారి, ఎస్‌ఐ చిన్నరెడ్డెప్పకు ఫోన్‌చేసి గ్రావెల్ తరలిస్తున్న టిప్పర్లను సీజ్ చేయాలని ఆదేశించారు. ఎస్‌ఐ, తహసీల్దార్ తమ సిబ్బందితో వెళ్లగా అక్కడున్న తమిళతంబీలు వాగ్వాదానికి దిగారు. చివరకు రెండు టిప్పర్లను మాత్రమే అధికారులు సీజ్ చేశారు.

మిగిలిన వాహనాలను వదిలేయడంపై విమర్శలు

సంఘటన స్థలంలో సుమారు 10 టిప్పర్లు, రెండు పొక్లెయినర్లు ఉన్నాయి. వీటిల్లో కేవలం రెండు టిప్పర్లను మాత్రమే సీజ్ చేయడంపై సర్వత్రా విమర్శలొస్తున్నాయి.

గతంలో ఇలా..

సుమారు ఒకటిన్నర నెల క్రితం వరకు పాలసముద్రం మండలం నుంచి తమిళనాడుకు టిప్పర్లలో గ్రావెల్‌ను అక్రమంగా తరలించేవారు. ఈ విషయం కలెక్టర్‌తోపాటు సీఎం దృష్టికీ వెళ్లింది. అప్పట్లో ఎమ్మెల్యే థామస్ ఆదేశాలతో అధికారులు ఆరు టిప్పర్లను సీజ్ చేసి, గ్రావెల్ మాఫియాకు చెక్ పెట్టారు. టిప్పర్లకు భారీ ఎత్తున జరిమానాలు విధించి 15 రోజుల కిందట విడుదల చేశారు.

అధికారులు ఏం చెబుతున్నారంటే..

వనదుర్గాపురం అడవిలో ఉన్న క్వారీకి పర్మిషన్ ఉందని అధికారులు చెబుతున్నారు. 'గ్రావెల్‌ను తమిళనాడుకు తరలించాలంటే ఇక్కడ జీఎస్టీ చెల్లించాలి. జీఎస్టీ చెల్లించక పోవడంతోపాటు ఎలాంటి బిల్లులూ లేకుండానే తమిళనాడుకు భారీ ఎత్తున గ్రావెల్‌ను తరలించేస్తుండటంతో కలెక్టర్ ఆదేశాలతో రెండు టిప్పర్లను సీజ్ చేశాం' అని అధికారులు తెలిపారు.

పంటలపై కొనసాగుతున్న గజదాడులు

పులిచెర్ల మండలంలోని పంటలపై ఏనుగుల దాడులు ఆగడం లేదు. ఇప్పటివరకు రెండు మందలుగా ఉంటూ ఏనుగులు దాడి చేసేవి. ఆదివారం రాత్రి నుంచి రెండుచోట్ల ఒంటరి ఏనుగులు, మరో ప్రాంతంలో 15 ఏనుగుల మంద పంటలపై పడింది. వీటిదెబ్బకు రైతులు, స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

● రెండుచోట్ల ఒంటరి ఏనుగులు.. మరో ప్రాంతంపైపడ్డ మంద
● భయాందోళనలో రైతులు, స్థానికులు

కల్లూరు,సెప్టెంబరు8(ఆంధ్రజ్యోతి): ముందుగా పశ్చిమ విభాగం అటవీ ప్రాంతంలోని గోగులమ్మ వంక నుంచి బయల్దేరిన 15 ఏనుగుల మంద కల్లూరు-గంటావారిపల్లె రోడ్డును దాటుకుని కల్లూరు సమీపానికి చేరుకున్నాయి. కల్లూరులోని ఖాదర్ బాషా, మహబూబ్ బాషాకు చెందిన మామిడి చెట్లు, గేటు, రాతికూసాలను ధ్వంసం చేశాయి. అక్కడినుంచి తలావారిపల్లె వద్దకు చేరుకుని లక్ష్మీనారాయణ, శేషాద్రి, దేవేంద్ర, మల్లికార్జున్‌కు చెందిన మామిడిచెట్లను విరిచేసి, పశుగ్రాసాన్ని తొక్కేసిన ఏనుగుల మంద తిరిగి గంటావారిపల్లె రోడ్డుకు చేరుకున్నాయి. రోడ్డుకు ఇరువైపులా ఉన్న కలబందలను తింటూ పశ్చిమ విభాగం అడవిలోని పెద్దవంక వద్దకెళ్లి

మిగతా 7వ పేజీలో



ధ్వంసమైన అరటిచెట్లు

యూరియా కోసం క్యూకట్టిన రైతులు



పెద్దకొండామారి రైతు సేవా కేంద్రం వద్ద వేచి ఉన్న రైతులు

చౌడేపల్లె, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): యూరియా కోసం రైతు సేవా కేంద్రా (ఆర్‌ఎస్కే)ల వద్ద రైతులు సోమవారం క్యూకట్టారు. చౌడేపల్లె మండలానికి కేవలం 81 టన్నుల యూరియా మాత్రమే స్టాక్ వచ్చింది. 12 ఆర్‌ఎస్కేలుండగా, ఒక్కో కేంద్రానికి కేవలం 150 బస్తాలు మాత్రమే అందుబాటులో ఉంచారు. ఆ మేరకు రైతులకు టోకెన్లు పంపిణీ చేశారు. అయితే ఒక్కో కేంద్రం వద్దకు సుమారు 250మంది రైతులు వచ్చారు. పుదిపట్ల, దుర్గసముద్రం కేంద్రాల వద్ద క్యూలైన్లలో రైతుల మధ్య చిన్నపాటి ఘర్షణ జరగడంతో పుంగనూరు రూరల్ సీఐ రాంభూపాల్ వెళ్లి సర్దుబాటు చేశారు. ఏఈవో మోహన్‌కుమార్ మాట్లాడుతూ.. మరో రెండ్రోజుల్లో మళ్లీ యూరియా స్టాక్ వస్తుందని తెలిపారు.

టోకెన్ల కోసం రైతుల రద్దీ

పలమనేరు: పలమనేరు మండలం పెంగరగుంటలోని ఆర్‌ఎస్కేలో సోమవారం టోకెన్ల కోసం రైతుల రద్దీ పెరిగింది. ఒకదశలో అధికారులు పోలీసుల సాయంతో టోకెన్లు పంపిణీ చేయాల్సి వచ్చింది. 250 బస్తాల యూరియా రాగా, 200 బస్తాలకుపైగా టోకెన్లు అందజేశారు.

రైతులూ.. కంగారు పడొద్దు

జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ

సోమల, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): యూరియా అవసరమైన ప్రతి రైతుకు అందజేయడం జరుగుతుందని.. ఎవరూ కంగారు పడాల్సిన అవసరం లేదని జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ తెలిపారు. సోమవారం సోమల ఆర్‌ఎస్కేలో రైతులకు యూరియా బస్తాలు అందజేశారు. అలాగే పెద్దఉప్పరపల్లె, ఆవులపల్లె, చిన్నఉప్పరపల్లె, వల్లిగట్ల ఆర్‌ఎస్కేల్లో యూరియా పంపిణీ కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. యూరియా అధిక వినియోగం తగ్గించాలని రైతులకు సూచించారు. ఏడీఏ శివకుమార్, తహసీల్దార్ మధుసూదన్, ఏవో సుధాకర్, టీడీపీ మండల అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు, సింగిల్ విండో అధ్యక్షుడు శివశంకర్, వేణుగోపాల్ నాయుడు, విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

డీఎంహెచ్‌వో కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ సరెండర్

చిత్తూరు రూరల్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్ రూప్‌కుమార్‌ను డీఎంహెచ్‌వో సుధారాణి సోమవారం కలెక్టర్‌కు సరెండర్ చేశారు. ఇటీవల జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో ఏఎన్ఎం పోస్టుల బదిలీల్లో అవకతవకలు జరిగినట్లు కలెక్టర్‌కు ఫిర్యాదులు అందాయి. దీనిపై విచారించి, ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ విషయంలో మరింత లోతుగా విచారిస్తే పెద్ద తలకాయలు బయటపడతాయని ఆ శాఖ వర్గాల్లో చర్చ నడుస్తోంది.

నేటి వైసీపీ నేతల ర్యాలీకి అనుమతి లేదు

నెలాఖరు వరకు పోలీసు యాక్టు : డీఎస్పీ

7లో

తిరుమలలో లెఫ్టినెంట్ జనరల్ ధీరజ్



లెఫ్టినెంట్ జనరల్ ధీరజ్ సేథ్

తిరుమల, సెప్టెంబరు8(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని సోమవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. లెఫ్టినెంట్ జనరల్ ధీరజ్ సేథ్, కార్పొరేట్ మాజీ లాబియిస్ట్ నీరా రాడియా, తెలంగాణ ఎమ్మెల్సీ దయానంద్ ఉన్నారు.

తిరుమలలో భద్రతా ఏర్పాట్ల పరిశీలన

తిరుమల, సెప్టెంబరు8(ఆంధ్రజ్యోతి): బ్రహ్మోత్సవాల నేపథ్యంలో తిరుమలలో జరుగుతున్న భద్రతా ఏర్పాట్లను తిరుపతి ఎస్పీ హర్షవర్ధన్‌రాజు సోమవారం పరిశీలించారు. మాడవీధుల్లోకి ప్రవేశించే మార్గాలను పరిశీలించారు. గరుడసేవ సమయంలో అదనంగా ఏర్పాటు చేయనున్న క్యూలైన్లపై స్థానిక పోలీసు అధికారులతో చర్చించారు. పలు సూచనలు చేశారు.

తనిఖీలు : పోలీసులు, విజిలెన్స్, బాంబ్‌స్క్వాడ్, రెవిన్యూ, ఫారెస్ట్, ఫైర్, విద్యుత్, హెల్త్ అధికారులు రెండు బృందాలుగా విడిపోయి అలిపిరి కాలినడక మార్గంలో తనిఖీలు చేశారు. 150 దుకాణాలను పరిశీలించి నిబంధనలను పాటించని 13 దుకాణాలకు నోటీసులు ఇచ్చారు. సీసీ కెమెరాలు లేని దుకాణ యజమానులను హెచ్చరించారు. లైసెన్స్ లేకుండా వ్యాపారాలు చేస్తున్న హాకర్లను అదుపులోకి తీసుకుని తిరుపతికి పంపారు. ఇలా ఉండగా అత్యవసర సమయాల్లో భక్తులకు సీపీఆర్ చేసే అంశంపై సోమవారం పోలీసు సిబ్బందికి తిరుపతి రెడ్‌క్రాస్ సొసైటీకి చెందిన డాక్టర్లు ప్రసాద్, ప్రతీత్ ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.



బ్రహ్మోత్సవాల్లో ఏర్పాటు చేయనున్న క్యూలైన్ల మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ

సర్వదర్శనానికి 8 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 8 గంటల సమయం పడుతోంది. సోమవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 9 షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయి క్యూలైన్ బాటగంగమ్మ ఆలయ సర్కిల్ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

శనివారం హుండీ ఆదాయం: రూ.4.39 కోట్లు

ఆదివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 27,410

తలనీలాలు సమర్పించినవారు: 9,656





శ్రీవారి సేవకు మళ్లీ సింఘాల్ | జీఏడీకి శ్యామలరావు

గతంలో పని చేసింది: 2017 మే 6 నుంచి 2020 అక్టోబరు 4వ తేది వరకు.

టీటీడీ ఈవోగా మరోసారి అనిల్‌కుమార్ సింఘాల్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో ఆయన టీడీపీ ప్రభుత్వంలో ఈవోగా నియమితులైనప్పటికీ వైసీపీ ప్రభుత్వంలోనూ ఏడాది పాటు ఈవోగా కొనసాగారు. మొత్తమ్మీద మూడున్నరేళ్ల పాటు ఈవోగా పనిచేశారు. 'నార్త్‌ఇండియన్‌గా ఉన్న సింఘాల్‌కు ఇక్కడ ఆచారాలు ఏం తెలుసు, ఎలా పనిచేస్తారు, ఏపీలో ఐఏఎస్ అధికారులు ఎవరూ లేరా' అంటూ తీవ్రస్థాయిలో విమర్శలు వచ్చినప్పటికీ ఆయన్ను ఈవోగా నియమిస్తూ తీసుకున్న నిర్ణయాన్ని నాటి ప్రభుత్వం మార్చలేదు. అప్పటి సీఎం చంద్రబాబు పెట్టుకున్న నమ్మకానికి తగ్గట్టు టీటీడీ ఈవోగా మూడేళ్ల ఐదు నెలల పాటు పనిచేసిన సింఘాల్ అనేక సంస్కరణలు తీసుకొచ్చి అందరి ప్రశంసలు అందుకున్నారు.

సర్వదర్శన భక్తులకు స్లాటెడ్ టోకెన్లు

సామాన్య భక్తులూ అతితక్కువ సమయంలోనే శ్రీవారిని దర్శించుకోవాలనే తపనతో స్లాటెడ్ సర్వదర్శన (ఎస్ఎస్‌డీ) విధానాన్ని ప్రవేశపెట్టింది సింఘాలే. నేటికీ ఈ విధానం విజయవంతంగా సాగుతోంది. అలాగే గరుడవారధి ప్రారంభమైంది కూడా సింఘాల్ ఆధ్వర్యంలోనే. టీటీడీలో ఈ ఫైలింగ్ విధానానికీ శ్రీకారం చుట్టారు. ఆలయంలోని పురాతన మండపాలను ప్రతిఒక్కరు వీక్షించేలా మండపాలకు ఉన్న ఇత్తడి గ్రిల్స్‌ను తొలగించారు. కంపార్టుమెంట్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయి క్యూలైన్ రోడ్లపైకి వచ్చేది. దీనికి పరిష్కారంగా నారాయణగిరి పార్కులో సింఘాల్ ఆదేశాల మేరకు తొమ్మిది షెడ్లను నిర్మించారు. దీంతో ఎన్నో సౌకర్యాలతో కూడిన షెడ్లలో భక్తులు తమ సమయం వచ్చేవరకు వేచిఉంటున్నారు. ధ్వజస్తంభం వద్ద మూవింగ్ రూఫ్ నిర్మించారు. ముఖ్యంగా వివిధ ప్రాంతాల్లో ఆలయాల పరిరక్షణ, నూతన ఆలయాల నిర్మాణం, ఆధునికీకరణ వంటి వాటికోసం శ్రీవాణి ట్రస్టును ప్రారంభించారు.

ఇక, ప్రైవేట్ బ్యాంకుల్లో బంగారు, నగదు డిపాజిట్లు, శ్రీవారి ఆలయంలో ఇనుప వంతెన నిర్మాణం వంటి అతి తక్కువ విషయాల్లో మాత్రం సింఘాల్ విమర్శలను ఎదుర్కోవాల్సి వచ్చింది.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

టీటీడీ ఈవో బదిలీ

తిరుమల-తిరుపతి దేవస్థానాల కార్యనిర్వహణాధికారి శ్యామలరావు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో సీనియర్ ఐఏఎస్ అనిల్ కుమార్ సింఘాల్ మళ్లీ ఈవోగా నియమితులయ్యారు. గతంలో మూడున్నరేళ్ల పాటు ఈయన టీటీడీ ఈవోగా పనిచేశారు. ప్రస్తుత ఈవో శ్యామలరావును జీఏడీ (పొలిటికల్)లో కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ సీఎస్ విజయానంద్ సోమవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి.

టీటీడీ ఈవోగా పనిచేసింది: గతేడాది జూన్ 16వ తేది నుంచి ప్రస్తుతం బదిలీ అయ్యే వరకు.

సీఎం చంద్రబాబు ఏరికోరి టీటీడీ ఈవోగా తెచ్చుకున్న జె.శ్యామలరావు 15 నెలలకే బదిలీ కావడం టీటీడీ వర్గాల్లో విస్మయాన్ని రేకెత్తిస్తోంది. జీఏడీ (పొలిటికల్)లో కార్యదర్శిగా ఆయన్ను నియమిస్తూ సోమవారం బదిలీ ఉత్తర్వులు వచ్చాయి. చంద్రబాబు సీఎం హోదాలో తొలిసారి తిరుమలకు రాకముందే.. అప్పటికి ఇన్‌చార్జి ఈవోగా ఉన్న ధర్మారెడ్డిని ప్రభుత్వం ఆగమేఘాలపై తప్పించి శ్యామలరావును నియమించింది. ఆ తర్వాతే సీఎం హోదాలో చంద్రబాబు తిరుమల వెళ్లారు. రాష్ట్రంలో గాడి తప్పిన పాలనను ప్రక్షాళన చేస్తానని, ఆ ప్రక్రియ టీటీడీ నుంచే ప్రారంభిస్తానని ఆ సందర్భంగా చంద్రబాబు ప్రకటించారు. అయితే, టీటీడీ పరిపాలనలో సీఎం ఆలోచనలు, అంచనాలకు అనుగుణంగా పనిచేయడంలో శ్యామలరావు వెనకబడటంతో బదిలీ జరిగిందన్న ప్రచారం జరుగుతోంది. ఈ ఏడాది జనవరిలో తిరుపతి బైరాగిపట్టెడలోని వైకుంఠ ద్వారదర్శన టోకెన్ల జారీ కేంద్రాల వద్ద తొక్కిసలాట జరిగి ఆరుగురు భక్తులు మృతి చెందగా, 40 మంది గాయపడిన సంగతి తెలిసిందే. ఆ ఘటనతో సీఎం చంద్రబాబు టీటీడీ అధికార యంత్రాంగంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అప్పటి నుంచే ఆయనలో టీటీడీ ఈవో పట్ల అసంతృప్తి మొదలైనట్టు సమాచారం. దానికి తోడు పలు ఇతర కారణాలూ తోడయ్యాయని టీటీడీ, రాజకీయ వర్గాలు చెబుతున్నాయి.

కొన్ని అంశాల్లో తనదైన ముద్ర

టీటీడీ ఈవోగా పనితీరులో పాలకమండలి నుంచి అసంతృప్తిని, ఆరోపణలను ఎదుర్కొన్న ఈవో శ్యామలరావు.. కొన్ని అంశాల్లో టీటీడీ పాలనపై తనదైన ముద్ర వేశారు. ఈవోగా బాధ్యతలు తీసుకున్న వెంటనే శ్రీవారి ప్రసాదాలకు వినియోగించే నెయ్యి నాణ్యతను అనుమానించి నమూనాలను ల్యాబ్‌కు పంపడం ద్వారా కల్తీ జరిగిందని గుర్తించారు. దాంతో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో సాగిన వ్యవహారాలపై ప్రపంచవ్యాప్తంగా శ్రీవారి భక్తుల్లో ఆవేదన, ఆగ్రహం పెల్లుబికాయి. శ్రీవారి ప్రసాదాలకు పూర్వపు రుచి, నాణ్యత తెప్పించడానికి కృషి చేసి సఫలీకృతులయ్యారు. సేంద్రియ ఉత్పత్తుల ఖరీదు ఎక్కువన్న సాకుతో ఆలయంలో అన్న ప్రసాదాలను గత ప్రభుత్వ హయాంలో కేవలం 5-6 వేల మందికి మాత్రమే అందించే వారు. ఆ ప్రసాదాల రుచి తగ్గడంతో భక్తుల నుంచీ విమర్శలు పెరిగాయి. దీనిపై దృష్టి పెట్టిన శ్యామలరావు సేంద్రియ పంట ఉత్పత్తుల స్థానంలో సాధారణ పంట ఉత్పత్తులను కొనుగోలు చేసి వాడడం ద్వారా మునుపటి రుచిని తెప్పించారు. ఆలయంలో 20 వేల మంది భక్తులను వాటిని పంపిణీ చేసేలా చర్యలు తీసుకున్నారు. నిత్యాన్నదాన సత్రంలో కూడా నాణ్యతపై దృష్టి పెట్టారు. సరైన ముడిసరుకులు కొనడం లేదని గుర్తించారు. రిలయన్స్ మార్కెటింగ్ నిపుణుల సాయం తీసుకున్నారు. నిపుణుల కమిటీ ఏర్పాటు చేసి సూచనలు తీసుకుని పాటించారు. దీంతో నిత్యాన్నదాన సత్రంలో కూడా అన్నప్రసాదాల రుచి, నాణ్యత పెరిగాయి. శ్రీవారి సేవ విభాగంలో కూడా భక్తులకు మెరుగైన సేవలందించేందుకు శ్రీవారి సేవకులకు శిక్షణ ఇప్పించేలా సంస్కరణలు తెచ్చారు. శ్రీవారి మాడవీధుల్లో భక్తులకు గోవింద నామాలు నుదుట పెట్టడం, ఐటీ విభాగంలో చాలా లోపాలను అరికట్టారు.

ఆ నిర్ణయాలపై..

వైసీపీ హయాంలో అడ్డదిడ్డంగా జరిగిన నియామకాలను రద్దు చేయడంలో శ్యామలరావు చురుగ్గా వ్యవహరించలేదని ప్రభుత్వం భావిస్తున్నట్టు తెలిసింది. ఉదాహరణకు గత ప్రభుత్వంలో నిబంధనలు పాటించకుండా అర్హత లేని వ్యక్తిని ఏకంగా ఐటీ విభాగం జీఎంగా నియమించిన సంగతి తెలిసిందే. అతడిని ఈవో శ్యామలరావు ఐటీ జీఎం పోస్టు నుంచి తప్పించి మరో విభాగానికి బదిలీ చేశారు. నియామకమే అక్రమమైనప్పుడు తొలగించకుండా, కోర్టు కేసులు వస్తాయన్న సాకుతో విభాగం మార్చడం విమర్శలకు దారి తీసింది. అదే పోస్టులో గతంలో ఉండి వైసీపీ ముద్ర వేసుకున్న ఓ అధికారికి తిరిగి ఐటీ విభాగం జీఎం పోస్టు కట్టబెట్టారని బోర్డు అసంతృప్తి వ్యక్తం చేసి.. తొలగించాలని నిర్ణయం తీసుకుంది. దీనినీ చాలా ఆలస్యంగా అమలు చేశారన్న ఆరోపణలున్నాయి. ఇక, టీటీడీ బోర్డుతో సమన్వయ లోపం ఉన్నట్లు కొన్ని నెలలుగా ప్రచారంలో ఉంది. దీనిపై సీఎంకూ ఫిర్యాదులు అందినట్లు తెలిసింది. ఇక, తాము తీసుకున్న నిర్ణయాలను అమలు చేయడంలో ఈవో తీవ్ర తాత్సారం చేస్తున్నారంటూ సభ్యులు అసంతృప్తి వ్యక్తంచేశారు. దర్శనాల విషయంలో ఏఐ వినియోగం, అలిపిరి పాదాల మండపాన్ని రూ.8 కోట్లతో పునరుద్ధరించేందుకు ఓ దాత ముందుకు రాగా సకాలంలో స్పందించలేదని, టీటీడీ విద్యా సంస్థల్లో దీర్ఘకాలంగా పనిచేస్తున్న లెక్చరర్లు, డ్రైవర్లను రెగ్యులర్ చేసేందుకు బోర్డు తీర్మానించినా అమలు ఆలస్యమయ్యేలా వ్యవహరించారని సభ్యులు అసంతృప్తితో ఉన్నట్లు సమాచారం.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

పీజీఆర్ఎస్ వినతులపై ప్రత్యేక దృష్టి



అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ హర్షవర్ధనరాజు

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): పీజీఆర్ఎస్ కార్యక్రమంలో ప్రజలు ఇచ్చే వినతులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్పీ హర్షవర్ధనరాజు ఆదేశించారు. సోమవారం ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో 106 వినతులు వచ్చాయి. 9 కౌంటర్లు ఏర్పాటు చేసి, వినతులు స్వీకరించారు. ఎస్పీ నేరుగా ప్రజలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు రవిమనోహరాచారి, నాగభూషణరావు, సీఐలు పాల్గొన్నారు.

పకడ్బందీగా మిషన్ సంకల్ప అమలు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): మిషన్ సంకల్ప కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం సంకల్పపై ఒకరోజు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ అన్ని శాఖలు సమన్వయంతో జిల్లాలో సంకల్ప కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. మహిళలు, ఆడపిల్లలపై సమాజంలో జరుగుతున్న అన్యాయాలపై అవగాహన కల్పించడానికి ఈ నెల 12వ తేదీ వరకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ వసంతబాయి, డీఎంహెచ్‌వో బాలకృష్ణనాయక్, జిల్లా మిషన్ కోఆర్డినేటర్ కృష్ణమంజరి, ఐసీడీఎస్ నోడల్ ఆఫీసర్ వాసంతి, అధికారిణి సుధారాణి పాల్గొన్నారు.

బోల్తాపడ్డ కారు : తప్పిన ముప్పు



తిరుచానూరు, సెప్టెంబరు8(ఆంధ్రజ్యోతి): తిరుపతి నుంచి రేణిగుంట వైపు వెళుతున్న కారు సోమవారం వేకువజామున తిరుచానూరు హరిజనవాడ వద్ద హైవే నుంచి పక్కనే ఉన్న కాలువలో బోల్తా పడింది. మద్యం తాగి అతివేగంగా కారు నడిపినట్లు స్థానికులు చెప్పారు. డ్రైవర్ కారును అలాగే వదిలేసి వెళ్లిపోగా తిరుచానూరు పోలీసులు క్రేన్ సాయంతో వెలికితీశారు.

రేపు, ఎల్లుండి ఆర్చరీ, స్కేటింగ్ పోటీలు

తిరుపతి(క్రీడలు), సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తిలో ఈనెల 10న అండర్ 14, 17, 19 విభాగాలలో ఆర్చరీ, 11న తిరుపతి శ్రీనివాస క్రీడా సముదాయంలో అండర్ 11, 14, 17, 19 విభాగాలలో స్కేటింగ్ జిల్లా స్థాయి పోటీలు నిర్వహించనున్నట్లు స్కూల్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శులు కిషోర్‌కుమార్, భార్గవి తెలిపారు. 6వ తరగతి నుంచి ఇంటర్ విద్యార్థులు అర్హులని, ఆసక్తిగల బాలబాలికలు సొంత క్రీడా సామగ్రితో హాజరుకావాలని పేర్కొన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడి నుంచి వయస్సు ధ్రువీకరణ పత్రం, ఇంటర్ విద్యార్థులు పదవ తరగతి ఒరిజినల్ మార్కులిస్టు తీసుకురావాల్సి ఉంటుందని వివరించారు. మరిన్ని వివరాలకు 9290502041(ఆర్చరీ), 9985533560(స్కేటింగ్)లను సంప్రదించాలని కోరారు.

డప్పు కళాకారులను ఆదుకోవాలి

- సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.కుమార్‌రెడ్డి




డప్పు కళాకారుల సమావేశంలో ప్రసంగిస్తున్న రాష్ట్ర అధ్యక్షులు కుమార్‌రెడ్డి

తిరుపతి(కల్చరల్), సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి) : డప్పు కళాకారులను అన్ని విధాలా ఆదుకోవాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.కుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. తిరుపతిలోని ఏపీ ఫౌండేషన్ కార్యాలయంలో సోమవారం చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాల డప్పు కళాకారుల సంఘం నాయకులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2017లో అప్పటి టీడీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన రూ.3వేల పింఛను పెంచాలని కోరారు. కళాకారులకు భాషా సాంస్కృతిక శాఖ గుర్తింపు కార్డులు ఇచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ఏపీ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, మాజీ మంత్రి పరసారత్నం మాట్లాడుతూ ప్రభుత్వపరమైన సమస్యల పరిష్కారానికి తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డప్పు కళాకారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి మారెళ్ల శ్రీనివాసులు, మురగారెడ్డి, పి.రెడ్డెప్ప, అంజయ్య, మురళి, సహదేవయ్య, వెంకటేష్, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

రూ.లక్షల విలువైన మందులు వృథా

- కాలం చెల్లడంతో డిస్పోజబుల్ కేంద్రానికి తరలింపు

డక్కిలి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పేదల కోసం ప్రభుత్వం సరఫరా చేసిన మందులు మట్టిపాలయ్యాయి. సకాలంలో వినియోగించుకోకపోవడంతో కాలం చెల్లిన మందులను వృథాగా పడేయాల్సి వచ్చింది. ఆదివారం అర్ధరాత్రి డక్కిలి ప్రభుత్వాస్పత్రి నుంచి మందులను తీసుకెళ్తున్న ట్రాక్టరును స్థానికులు గుర్తించి అడ్డుకునే ప్రయత్నం చేయడంతో ఈ విషయం తెలుగులోకి వచ్చింది. దీనిపై స్థానిక వైద్యాధికారిణి బిందుప్రియాంకను వివరణ కోరగా.. అవి డక్కిలి ఆస్పత్రికి చెందిన మందులు కాదని, 104 ఆధ్వర్యంలో వైద్యశిబిరాలు నిర్వహించేందుకు ప్రభుత్వం సరఫరా చేసిన మందులని తెలిపారు. కాలం చెల్లిపోవడంతో రాపూరులోని డిస్పోజబుల్ కేంద్రానికి ట్రాక్టరు తీసుకెళుతుండగా కొంత మంది ఉద్దేశపూర్వకంగా రాద్ధాంతం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓ ఆర్ఎంపీ వైద్యుడు ఈ ఘటనను తప్పుదారి పట్టించేందుకు ప్రయతిస్తున్నారని, దీనిపై విచారణ చేపడతామని డాక్టర్ బిందుప్రియాంక చెప్పారు.



డక్కిలి ప్రభుత్వాస్పత్రి నుంచి మందులను తీసుకెళ్తున్న ట్రాక్టరు

బంగారు నగల దుకాణంలో చోరీ యత్నం

నాయుడుపేట టౌన్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): నాయుడుపేట పట్టణం బజారువీధిలోని ఓ బంగారు నగల దుకాణంలో ఇద్దరు మహిళలు చోరీకి యత్నించారు. యాజమాని అప్రమత్తం కావడంతో పరారయ్యారు. వారిని స్థానికులు వెంబడించి ఒక మహిళలను పట్టుకుని పోలీసులకు అప్పగించారు. పట్టణం బజారువీధిలో శ్రీనివాసులు అనే వ్యక్తి బంగారు నగల దుకాణం నిర్వహిస్తున్నాడు. సోమవారం ఇద్దరు మహిళలు గొలుసులు, పట్టీలు కావాలంటూ దుకాణానికి వచ్చారు. శ్రీనివాసులు గొలుసులు, పట్టీల సెట్‌ను వారి ముందు ఉంచాడు. గొలుసులను పరిశీలిస్తున్న మహిళలు తీరును గమనించిన శ్రీనివాసులుకు అనుమానం వచ్చింది. రెండు నెలల క్రితం ఇద్దరు మహిళలు దుకాణానికి వచ్చి గొలుసులు అపహరించుకుని వెళ్లారు. అయితే నిందితులను గుర్తించక ఫిర్యాదు చేయకుండా మిన్నకుండిపోయాడు. సోమవారం వచ్చిన మహిళలే గతంలో గొలుసులు అపహరించుకుని వెళ్లిన ఉంటారని భావించి, వారిని అనుక్షణం పరిశీలిస్తూ అప్రమత్తంగా వ్యవహించాడు. ఇది గమనించి సదరు మహిళలు వెంటనే దుకాణం నుంచి వెళ్లిపోతూ పరుగులు తీయగా శ్రీనివాసులు వారిని వెంబడిస్తూ కేకలు వేశాడు. సమీపంలోని రాజగోపాలపురంలో స్థానికులు ఒక మహిళను పట్టుకున్నారు. ఇంతలో అక్కడకు చేరుకున్న దుకాణ యజమాని శ్రీనివాసులు సమక్షంలో పోలీసులకు అప్పగించారు. ఇంకో మహిళ తప్పించుకోవడంతో ఆమె కోసం పోలీసులు గాలింపు చేపట్టారు. కాగా, ఈ ఇద్దరు మహిళలు సత్యవేడులోని బంగారు దుకాణాల్లో చోరీకి పాల్పడిన్నట్లు పోలీసులకు సమాచారం అందడంతో విచారణ చేపట్టారు.

'ఆర్‌డీఎస్ఎస్' పనులను లక్ష్యం మేరకు పూర్తి చేయండి



సీజీఎం జె.రమణాదేవి

తిరుపతి(ఆటోనగర్), సెప్టెంబరు8(ఆంధ్రజ్యోతి): సదరన్ డిస్కం పరిధిలోని గ్రామీణ ప్రాంతాల్లో జరుగుతున్న ఆర్‌డీఎస్ఎస్ పథకం పనులను లక్ష్యాల మేరకు పూర్తి చేయాలని నిర్మాణాల విభాగం చీఫ్ జనరల్ మేనేజరు జె.రమణాదేవి అధికారులను ఆదేశించారు. తిరుపతిలోని సదరన్ డిస్కం కార్పొరేట్ కార్యాలయంలో సోమవారం అన్ని జిల్లాల నిర్మాణాల విభాగం అధికారులతో ఆమె సమీక్షించారు. గ్రామీణ ప్రాంలతాల్లో త్రీఫేజ్ లైన్లు లేని గ్రామాల్లో లైన్లు లాగి విద్యుత్ సరఫరాను మెరుగు పరిచే పనులను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. ఈ పనులు పూర్తి చేయడం వల్ల గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ రంగానికి, ప్రజలకు, కుటీర, చిన్నతరహా పరిశ్రమలకు ఉపయోగ పడుతుందన్నారు. సమావేశంలో తొమ్మిది జిల్లాల ఈఈలు, డీఈఈలు ప్రాజెక్టుల విభాగం అధికారులు పాల్గొన్నారు.

ఫైర్ డిటెక్షన్ హెచ్చరికతో ఆగిన హౌరా ఎక్స్‌ప్రెస్

సూళ్లూరుపేట, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): హౌరా నుంచి తిరుచిరాపల్లికి వెళ్లే సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ సోమవారం రాత్రి సూళ్లూరుపేట రైల్వే గేటు వద్ద ఆగిపోయింది. రాత్రి 7 గంటల సమయంలో హౌరా సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ సూళ్లూరుపేట స్టేషన్ దాటి తహసీల్దార్ కార్యాలయం వద్దనున్న రైల్వేగేటు వద్దకు చేరుకోగానే రైలులో ఫైర్ సిస్టమ్ అలారం మోగింది. దీంతో అప్రమత్తమైన డ్రైవర్ అత్యవసరంగా రైలు నిలిపివేశాడు. వెంటనే రైల్వే సిబ్బంది అక్కడికి చేరుకుని బోగీలన్నింటినీ క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఎటువంటి సాంకేతిక లోపం లేదని నిర్ధారించిన తరువాత రైలు బయలుదేరింది. ప్రయాణికులు సిగరేట్ కాల్చి ఉంటారని, ఆ పొగకు ఫైర్ సిస్టం అలారం మోగి ఉండవచ్చునని రైల్వే సిబ్బంది అనుమానిస్తున్నారు. దాదాపు 15 నిమిషాలు రైలు ఆగిపోవడం, సిబ్బంది అన్ని భోగీల్లో తనిఖీలు చేపట్టడంతో ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు.

వ్యాను ఢీకొని ఒకరి దుర్మరణం

చంద్రగిరి, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండలం తొండవాడ సమీపంలోని సర్వీసు రోడ్డులో వ్యాను ఢీకొనడంతో ద్విచక్ర వాహనదారుడు మృతి చెందారు. పోలీసుల కథనం మేరకు.. తిరుపతి రూరల్ మండలం పైడిపల్లికి చెందిన అమరనాథరెడ్డి సోమవారం రాత్రి 10 గంటల సమయంలో శానంబట్ల నుంచి తిరుపతి వైపు వస్తున్నారు. అదేసమయంలో తిరుపతి నుంచి బెంగళూరు వస్తున్న వ్యాను ఢీకొంది. ఈప్రమాదంలో అమరనాథరెడ్డి(31)కి తీవ్ర గాయాలయ్యాయి. అంబులెన్స్‌లో తిరుపతి రుయాస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. పోలీసులు ప్రమాద స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మృతిచెందిన అమరనాథరెడ్డి

ఆగిన వేదపారాయణదార్ పోస్టుల భర్తీ

- విమర్శల నేపథ్యంలో నిలుపుదలకు ఆదేశిమిచ్చిన టీటీడీ

తిరుమల, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): టీటీడీలో వేదపారాయణదార్ పోస్టుల భర్తీ ప్రక్రియ ఆగిపోయింది. కేవలం ఓ ప్రాంత వాసులకు మాత్రమే ప్రాధాన్యమిస్తున్నారనే విమర్శలు, ఫిర్యాదుల నేపథ్యంలో దాదాపు 700 పోస్టుల భర్తీని టీటీడీ రద్దు చేసింది. గత ప్రభుత్వానికి సానుభూతిపరుడిగా ముద్ర ఉన్న ఓ అధికారి తమిళులకు మాత్రమే ప్రాధాన్యత ఇస్తున్నారంటూ కొందరు బ్రహ్మణులు సీఎంవోతో పాటు మంత్రి లోకేశ్, టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు దృష్టికి తీసుకెళ్లారు. ఈనెల 11వ తేదీన ఇంటర్వ్యూలు జరగాల్సి ఉన్న క్రమంలో ఈ పోస్టుల వ్యవహారానికి రాజకీయ, ప్రాంతీయ రంగు పులుముకుంది. దీంతో పోస్టుల భర్తీని తాత్కాలికంగా వాయిదా వేసినట్టు విశ్వసనీయమైన సమాచారం.

‘హంద్రీ-నీవా’తో చెరువులకు జలకళ

మొరవ పోతున్న యర్రంపల్లె చెరువు




మొరవ పోతున్న యర్రంపల్లె చెరువు - కృష్ణమ్మకు టీడీపీ నేతల జలహారతి

వి.కోట, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): హంద్రీ -నీవా కాల్వ నుంచి కృష్ణాజలాలు విడుదల చేయడంతో వి.కోట మండల పరిధిలో చెరువులకు జలకళ సంతరించుకుంది. రెండ్రోజుల కిందట కృష్ణాపురం పంప్ హౌస్ నుంచి జలవనరుల శాఖ అధికారులు బోడిగుట్టపల్లె పంచాయతీ పరిధిలోని యర్రంపల్లె చెరువుకు నీటిని విడుదల చేశారు. సోమవారం సాయంత్రానికి చెరువు నిండిపోయి దిగువనున్న చాడేపల్లె చెరువు వైపు పరుగులు తీసింది. దీంతో సర్పంచ్ విశ్వనాథ్ నేతృత్వంలో టీడీపీ నేతలు మొరవ వద్ద గంగమ్మకు జలహారతులు ఇచ్చారు. ఐదేళ్లుగా చుక్కనీరు లేని తమ చెరువును కృష్ణాజలాలతో నింపి సీఎం చంద్రబాబు రైతుల పక్షపాతిగా నిలిచారని కొనియాడారు. వి.కోట మండల పరిధిలో పెద్దబరిణేపల్లె, కొంగాటం, వి.కోట, బోడిగుట్లపల్లె, కృష్ణాపురం, నెర్నపల్లె పంచాయతీలో చెరువులకు హంద్రీ -నీవా జలాలు వచ్చి చేరుతుండటంతో రైతుల కళ్లల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. ఇప్పటికే దాసార్లపల్లె, పెద్దబరిణేపల్లె, యర్రంపల్లె, మందలకుంట చెరువులు నిండి మొరవపోతున్నాయి.

వ్యాధి నిరోధక టీకాలతో 13 ప్రాణాంతక వ్యాధులకు చెక్

● డీఎంహెచ్‌వో సుధారాణి

చిత్తూరు రూరల్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్లలోపు పిల్లలందరికీ వ్యాధి నిరోధక టీకాలు వేయించడం ద్వారా 13 ప్రాణాంతక వ్యాధుల నుంచి రక్షించవచ్చని డీఎంహెచ్‌వో సుధారాణి తెలిపారు. సోమవారం తన కార్యాలయంలో వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం నిర్వహణపై పీహెచ్‌సీ, సీహెచ్‌సీ, యూపీహెచ్‌సీ వైద్యాధికారులకు ఒక్క రోజు వర్క్ షాప్ నిర్వహించారు. డబ్ల్యూహెచ్‌వో కన్సల్టెంట్ షైనిక స్టెఫీథామస్ మాట్లాడుతూ.. వ్యాక్సిన్ బిడ్డకు అందేవరకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్యాధికారులకు అవగాహన కల్పించారు. అడిషనల్ డీఎంహెచ్‌వో వెంకటప్రసాద్, డీఐవో హనుమంతరావు పాల్గొన్నారు.

వెట్టిచాకిరీ నుంచి నలుగురికి విముక్తి



నిర్వాహకుడిని విచారిస్తున్న ఆర్డీవో శ్రీనివాసులు

గంగాధరనెల్లూరు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): వెట్టిచాకిరీ నుంచి నలుగురికి విముక్తి కల్పించారు. గంగాధరనెల్లూరు మండలం కోటాగరం పంచాయతీ ఎట్టేరి గ్రామానికి సమీపంలో ఓ సిమెంట్ బ్రిక్స్ తయారీ కేంద్రంలో వెట్టిచాకిరీ చేయిస్తున్నారని రేప్ స్వచ్ఛంద సంస్థ కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు ఫిర్యాదు చేసింది. స్పందించిన కలెక్టర్ వెంటనే చిత్తూరు ఆర్డీవో శ్రీనివాసులుకు ఆదేశాలిచ్చారు. స్థానిక రెవెన్యూ, పోలీస్ అధికారులతో కలిసి ఆర్డీవో సిమెంట్ బ్రిక్స్ తయారీకేంద్రాన్ని సోమవారం తనిఖీ చేశారు. నిర్వాహకుడిని విచారించారు. ‘పెనుమూరు మండలానికి చెందిన ఎక్స్‌కవేటర్ డ్రైవర్ ఒకరు రూ.4లక్షలు అడ్వాన్సుగా తీసుకుని కుటుంబంతోపాటు మా వద్దకు పనికి వచ్చాడు. కొన్నిరోజుల తర్వాత అతను చెప్పాపెట్టకుండా వెళ్లిపోయాడు. ఆ కుటుంబానికి చెందిన మహిళ మాత్రం పనిచేస్తూ, పిల్లలతో ఇక్కడే నివాసం ఉంటోంది. మేము వెట్టిచాకిరీ చేయించడం లేదు’ అని అధికారులకు నిర్వాహకుడు చెప్పినట్లు తెలిసింది. అయితే ఆ కుటుంబానికి చెందిన మహిళ మాత్రం తమకు రూ.లక్ష మాత్రమే ఇచ్చినట్లు అధికారులకు తెలిపారని సమాచారం. ప్రస్తుతానికి నలుగురినీ అక్కడి నుంచి పంపించేశామని, పూర్తిస్థాయిలో విచారణచేస్తేగాని వివరాలు చెప్పలేమని అధికారులు మీడియాకు తెలిపారు. తహసీల్దార్ శ్రీనివాసులు, ఏఎస్‌ఐ మురళీ ప్రసాద్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో చిన్నారి దుర్మరణం



వస్రీం మృతదేహం

శ్రీరంగరాజపురం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ చిన్నారి దుర్మరణం చెందాడు. ఎస్‌ఐ సుమన్ తెలిపిన వివరాల మేరకు.. ఎస్‌ఆర్‌పురం మండలం పెద్ద తయ్యూరు గ్రామానికి చెందిన ఖాదర్‌బాషా తన కుమారుడు వస్రీం(4)తో కలిసి బైక్‌పై సోమవారం సాయంత్రం 49.కొత్తపల్లెమిట్ట నుంచి స్వగ్రామానికి వస్తున్నాడు. మార్గమధ్యంలో మంగుంట రోడ్డు వద్దకొచ్చేసరికి చిత్తూరు-పుత్తూరు జాతీయ రహదారిపై బైక్ అదుపుతప్పి కిందపడ్డారు. ఈ ప్రమాదంలో చిన్నారికి తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులొచ్చి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

విగ్రహం చోరీ కేసులో నిందితుల అరెస్టు

ఐరాల, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): గార్గేయనదీ తీరంలోని పాలేటమ్మ ఆలయంలో అమ్మవారి శిరస్సు చోరీ చేసిన కేసులో నిందితులను సోమవారం అరెస్టు చేసినట్లు ఐరాల ఇన్‌చార్జి ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. ఆదివారం ఉదయం అమ్మవారి శిరస్సును చోరీచేసి తీసుకెళ్లగా దర్యాప్తు అధికారి బాబయ్య కాణిపాకం ఆలయం సమీపంలోని పుణ్యసముద్రం బ్రిడ్జి వద్ద శ్రీరాములు, నీల, జయరామ్, హరిప్రసాద్‌లను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి అమ్మవారి విగ్రహాన్ని, రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. అమ్మవారి శిరస్సును ఆలయ ధర్మకర్తకు అప్పగించినట్లు చెప్పారు. నిందితులను న్యాయమూర్తి ముందు హాజరు పరచగా, 14 రోజుల రిమాండ్ విధించారు.

పంటలపై కొనసాగుతున్న గజదాడులు

5వ పేజీ తరువాయి

తిష్ట వేశాయి.

పాతపేట, పాళెం పంచాయతీల్లో ఒంటరి ఏనుగు

పశ్చిమ విభాగం అటవీ ప్రాంతంలోని పెద్దవంక నుంచి ఆదివారం రాత్రి బయల్దేరిన ఒంటరి ఏనుగు గంటావారిపల్లె రోడ్డు మార్గంలో పాతపేట పంచాయతీ పూరేడువాండ్లపల్లె వద్దకు చేరుకుంది. గురప్ప, సత్యనారాయణ, శిద్దయ్య, ప్రభాకర్‌కు చెందిన వరి, కొబ్బరి, పశుగ్రాసాన్ని ధ్వంసం చేసి.. హంద్రీ-నీవా కాలువ మార్గంలో చిత్తూరు-కర్నూలు హైవేను దాటుకుని కల్లూరు ప్రభుత్వాస్పత్రి వద్దకు చేరుకుంది. కొంగరవారిపల్లెలోని సురేంద్రనాయుడుకు చెందిన మామిడిచెట్లను విరిచేసి, గుట్టమీదపల్లెకు చేరుకుని సమీపంలోని అరటిచెట్లను నాశనం చేసింది. అక్కడినుంచి తుడుంవారిపల్లె వద్దకు చేరుకుని మాతయ్యకు చెందిన పశుగ్రాసాన్ని తొక్కేసి, జూపల్లె వద్దకు చేరుకుని పాళెంలోని రైతు ఈశ్వరయ్యకు చెందిన మామిడిచెట్ల కొమ్మలను విరిచేసింది. తర్వాత తూర్పు విభాగం అటవీ ప్రాంతంలోని సూరప్పచెరువు వద్దకు చేరుకున్నట్లు అటవీశాఖ సిబ్బంది తెలిపారు.

గడ్డంవారిపల్లె వద్ద మరో ఒంటరి ఏనుగు

తిరుపతి జిల్లాలోని కల్యాణి డ్యాం నుంచి మూడ్రోజుల కిందట మండలానికి చేరుకున్న ఒంటరి ఆదివారం రాత్రి కూడా పంటలపై పడింది. తూర్పు విభాగం అటవీ ప్రాంతంలోని మూలమడుగు నుంచి బయల్దేరిన ఈ ఒంటరి ఏనుగు గడ్డంవారిపల్లె పంచాయతీ పాపిరెడ్డిగారిపల్లి వద్దకు చేరుకుంది. గ్రామంలోని నాగరాజు, చిరంజీవికి చెందిన వేరుశనగ పంటను ధ్వంసం చేసింది. అక్కడి నుంచి గడ్డంవారిపల్లెలోని మునిరాజుకు చెందిన అరటిచెట్లను నాశనం చేశాక అడవిలోని మూలమడుగు ప్రాంతానికి చేరుకున్నట్లు స్థానికులు తెలిపారు.

న్యాయం చేసి ఆదుకోండి

● ‘పీజీఆర్ఎస్’లో కలెక్టర్‌కు మొరపెట్టుకున్న బాధితులు



అర్జీదారుడితో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు అర్బన్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో సోమవారం పీజీఆర్ఎస్ (ప్రజా సమస్యల పరిష్కార వేదిక) కార్యక్రమం జరిగింది. బాధితుల నుంచి కలెక్టర్ సుమిత్‌కుమార్, జేసీ విద్యాధరితోపాటు పలువురు అధికారులు అర్జీలను స్వీకరించారు. బాధితుల సమస్యలను విని పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మొత్తం 343 అర్జీలు అందాయి. వీటిల్లో.. రెవెన్యూ, సర్వేశాఖకు సంబంధించి 241 అర్జీలు, డీఆర్‌డీఏకు 24, పోలీసుశాఖకు 19, డీసీహెచ్ఎస్‌కు 8, ఎస్ఎస్ఏకు 6, డ్వామాకు 5, పంచాయతీరాజ్‌కు 5, వ్యవసాయశాఖకు 3 అర్జీలు పోను హార్టికల్చర్, చేనేత, సైనిక్ వెల్ఫేర్, నేషనల్ హైవే, ఉపాధిశాఖ, రిజిస్ట్రేషన్, విద్యాశాఖ, గ్రామీణ నీటిపారుదల శాఖలకు కలిసి 32 అర్జీల చొప్పున ఉన్నాయి.

అధికారుల దృష్టికి వచ్చిన అర్జీల్లో కొన్ని...

● గ్రీన్ అంబాసిడర్లకు 25 నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాల్ని తక్షణమే జమ చేయాలని ఏఐటీయూసీ జిల్లా గౌరవాధ్యక్షులు నాగరాజన్, ప్రధాన కార్యదర్శి కోదండయ్య డిమాండ్ చేశారు. గ్రీన్ అంబాసిడర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని, గుర్తింపుకార్డులను ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ డీపీవోను పిలిపించి కార్మికులకు పెండింగ్‌లో ఉన్న జీతాలను విడుదల చేయాలని ఆదేశించారు.

● గతంలో ఉన్న శ్మశానవాటిక రోడ్డు విస్తరణలో పోయిందని, అప్పటి నుంచి ఎవరైనా చనిపోతే దహన సంస్కారాలకు ఇబ్బందులు పడుతున్నామని చిత్తూరు మండలం మాపాక్షి దళితవాడ గ్రామస్తులు మొరపెట్టుకున్నారు. గతంలో ఉన్న శ్మశానవాటికకు పడమర 1.5 ఎకరా ప్రభుత్వ భూమి ఉందని, ఆ భూమిని పరిశీలించి శ్మశానవాటికకు కేటాయించాలని కోరారు.

60 ఏళ్లుగా నివాసం ఉంటున్నాం



పెనుమూరు మండలం దాసరిపల్లె గ్రామస్తులు

పెనుమూరు మండలం దాసరిపల్లెలోని సర్వే నెంబరు 7లో 60 ఏళ్ల నుంచి 93 కుటుంబాలు ఇండ్లు కట్టుకుని నివాసాలుంటున్నామని గ్రామస్తులు తెలిపారు. ప్రస్తుతం నివాసాలున్న భూమి అంతా పశువుల మేత భూమిగా నమోదైనందున ఖాళీ చేయాలని తమపై రెవెన్యూ అధికారులు ఒత్తిడి చేస్తున్నారన్నారు. ఈ భూమిని పశువుల మేత భూమి నుంచి తొలగిస్తూ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. అయినా పట్టించుకోకుండా రెవెన్యూ అధికారులు ఖాళీ చేయమంటున్నారని చెప్పారు. పరిశీలించి న్యాయం చేయాలని కోరారు.

క్వారీ పనులను ఆపేయాలి



రైతులకు ఇబ్బందులు కలిగిస్తున్న క్వారీ పనులను తక్షణమే ఆపేయాలని వెదురుకుప్పం మండలం కొమరకుంట పంచాయతీ బందార్లపల్లె గ్రామస్తులు డిమాండ్ చేశారు. క్వారీ పనులపై ప్రశ్నినందుకు తమపై దాడి చేయడం అన్యాయమన్నారు. గ్రామస్తుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని న్యాయం చేయాలని కోరారు.

సరైన సమాచారం ఇవ్వలేదు



బీసీ సంఘం నేత షణ్ముగం

సమాచార హక్కు చట్టం ద్వారా చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో అపోలో యాజమాన్య సేవలకు సంబంధించి 21 అంశాలపై దరఖాస్తు చేసి మూడు నెలలు అవుతున్నా సరైన సమాచారం ఇవ్వలేదని బీసీ సంక్షేమ సంఘం దక్షిణాది రాష్ట్రాల ఇన్‌చార్జి షణ్ముగం ఆరోపించారు. కలెక్టర్ స్పందించి పూర్తి సమాచారం ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

జిల్లా పోలీసు కార్యాలయంలో..



అర్జీని పరిశీలిస్తున్న ఏఎస్పీ రాజశేఖర్‌రాజు

జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు సంబంధించి బాధితుల నుంచి ఏఎస్పీ రాజశేఖర్‌రాజు, డీఎస్పీ సాయినాథ్ అర్జీలను స్వీకరించారు. సోమవారం నాటి పీజీఆర్ఎస్‌కు భూ తగాదాలు 9, కుటుంబ తగాదాలు 8, డబ్బుల తగాదాలు 7, వేధింపులు 3, చిన్న తగాదాలు 3, ఆస్తి తగాదాలు 2, దారి తగాదాలు 2, ప్రేమవివాహం 1 చొప్పున మొత్తం 37 ఫిర్యాదులు అందాయి.

వరసిద్ధుడి ఆలయాభివృద్ధికి సహకరించండి

● టీటీడీ చైర్మన్‌ను కోరిన ఎమ్మెల్యే మురళీమోహన్



బీఆర్‌నాయుడికి జ్ఞాపికను అందిస్తున్న ఎమ్మెల్యే మురళీమోహన్, ఈవో పెంచలకిషోర్, మాజీ చైర్మన్ మణినాయుడు

ఐరాల(కాణిపాకం),సెప్టెంబరు8(ఆంధ్రజ్యోతి): కాణిపాక వరసిద్ధుడి ఆలయ అభివృద్ధికి మరింత సహకారం అందించాలని టీటీడీ చైర్మన్ బీఆర్‌నాయుడిని పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్, ఈవో పెంచలకిషోర్, మాజీ చైర్మన్ మణినాయుడు కోరారు. సోమవారం తిరుమలలోని చైర్మన్ అతిథి గృహంలో ఆయన్ను కలిశారు. కాణిపాకంలో టీటీడీ కల్యాణ మండపం, విశ్రాంతి భవన నిర్మాణానికి అవసరమైన ప్రణాళికలను అందించగా, చైర్మన్ బీఆర్ నాయుడు సానుకూలంగా స్పందించారు.

నీటి కుంటలో పడి వ్యక్తి మృతి



ముస్తాఫా (ఫైల్‌ఫొటో)

బంగారుపాళ్యం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తూ నీటి కుంటలో పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఏఎస్‌ఐ మల్లప్ప తెలిపిన వివరాల మేరకు.. ఐరాల మండలం మదిపట్లపల్లెకు చెందిన ముస్తాఫా (45).. గ్రామాల్లో తిరుగుతూ పాతసామాన్లు కొనుగోలు చేస్తాడు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం 11 గంటలకు తన స్వగ్రామమైన మదివట్లపల్లె నుంచి ద్విచక్ర వాహనంలో కుప్పాలపల్లెకు వెళుతుండగా అదుపుతప్పి రోడ్డుపక్కనే ఉన్న నీటికుంటలో పడ్డాడు. పాచి ఎక్కువగా ఉండడంతో అందులో మునిగిపోయి మృతి చెందాడు. సోమవారం ఉదయం ఆ దారిన వెళ్లేవారు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఏఎస్‌ఐ తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని నీటికుంటలో నుంచి వెలికితీశారు. ముస్తాఫా కుటుంబీకులకు సమాచారం ఇచ్చి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేటి వైసీపీ నేతల ర్యాలీకి అనుమతి లేదు : డీఎస్పీ

చిత్తూరు అర్బన్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): యూరియా కొరతపై వైసీపీ నేతలు మంగళవారం చేపట్టనున్న ర్యాలీకి అనుమతి లేదని చిత్తూరు డీఎస్పీ సాయినాథ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గానికి సంబంధించిన రైతులకు ఆర్ఎస్కేల వద్ద యూరియా పంపిణీ జరుగుతోందని, ప్రతి రైతుకూ అవసరమయ్యే యూరియా అందుబాటులో ఉందన్నారు. యూరియా కొరత ఉందని చెప్పి రైతులను ఆందోళనలకు గురిచేయడం సరికాదన్నారు. మంగళవారం యూరియా కొరతపై ఆర్డీవో కార్యాలయం వద్ద ర్యాలీ నిర్వహించడానికి అనుమతి కోరుతూ పూతలపట్టు వైసీపీ ఇన్‌చార్జి సునీల్‌కుమార్ వినతి పత్రాన్ని ఇచ్చారన్నారు. ర్యాలీలకు ఎలాంటి అనుమతి ఇవ్వలేదని, కేవలం పది మంది నేతలు వెళ్లి ఆర్డీవోకు వినతిపత్రాన్ని ఇవ్వాలని పేర్కొన్నారు.

నెలాఖరు వరకు 30 పోలీసు యాక్టు

చిత్తూరు సబ్ డివిజనల్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండటానికి ఈనెలాఖరు వరకు 30 పోలీసు యాక్టు అమలులో ఉంటుందని డీఎస్పీ సాయినాథ్ పేర్కొన్నారు. ముందస్తు అనుమతి లేకుండా సభలు, సమావేశాలు, ర్యాలీలు, ధర్నాలు, రాస్తోరోకోలు నిర్వహించకూడదన్నారు. చిత్తూరు సబ్ డివిజన్ పరిధిలోని చిత్తూరు 1, చిత్తూరు 2, తాలూకా పోలీసు స్టేషన్లతో పాటు జీడీ నెల్లూరు, ఎన్ఆర్‌పేట, పెనుమూరు, యాదమరి, గుడిపాల, తవణంపల్లె, కాణిపాకం, పూతలపట్టు, ఐరాల, కల్లూరు, రొంపిచెర్ల పోలీసు స్టేషన్ల పరిధిలో 30 పోలీసు యాక్టు అమలులో ఉంటుందన్నారు. ఉల్లంఘిస్తే కఠినంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వెనుకబడిన తరగతుల కోఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా అమరనాథ్

సదుం టీడీపీ నేతను వరించిన పదవి



పుంగనూరు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వెనుకబడిన తరగతుల కోఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా సదుం మండల టీడీపీ నాయకుడు గుండ్లపల్లి అమరనాథ్‌ను సోమవారం ప్రభుత్వం నియమించింది. సదుం మండలం రెడ్డివారిపల్లెలో బీసీ వర్గానికి చెందిన జి.సిద్దయ్య కుమారుడు అమరనాథ్.. టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీలోనే ఉన్నారు. అనేక ఇబ్బందులొచ్చినా, అక్రమకేసుల బారినపడినా 1994 నుంచి నేటివరకు సదుం మండల టీడీపీ ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు. ఈయన 1986లో వార్డు సభ్యుడిగా, 1995-96, 2002-03లో రెండుమార్లు రెడ్డివారిపల్లె పంచాయతీ సర్పంచ్‌గా గెలుపొందారు. టీడీపీ యూనిట్ ఇన్‌చార్జిగానూ పనిచేశారు. ఈ సందర్భంగా అమరనాథ్ మాట్లాడుతూ.. చల్లా రామచంద్రారెడ్డి తండ్రి చల్లా ప్రభాకర్‌రెడ్డి ఎమ్మెల్యేగా ఉన్నప్పటి నుంచి ఇప్పటివరకు ఎన్ని కష్టాలొచ్చినా, అక్రమ కేసులు పెట్టినా టీడీపీలోనే ఉన్నానని చెప్పారు. చంద్రబాబు పర్యటన సందర్భంగా పుంగనూరు పోలీసులు అక్రమంగా పెట్టిన కేసులో 28రోజులు కడప సెంట్రల్‌జైలులో రిమాండ్ అనుభవించానని తెలిపారు. తనికీ పదవి రావడానికి కారకులైన సీఎం చంద్రబాబుకు, మంత్రులు లోకేశ్, రాంప్రసాద్‌రెడ్డికి, పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

పడిపోయిన కూరగాయల ధరలు

అప్పుల ఊబిలో రైతులు




పలమనేరు మార్కెట్‌కు వచ్చిన టమోటా, క్యాబేజి

పలమనేరు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కూరగాయల ధరలు పడిపోవడంతో రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయారు. టమోటా, బంగాళాదుంప, క్యారెట్, బీట్‌రూట్, క్యాబేజి, క్యాలీ ఫ్లవర్, కాకర, బీర సాగు చేసిన రైతులైతే తీవ్రంగా నష్టపోయారు. సోమవారం పలమనేరు మార్కెట్‌లో టమోటా బాక్సు రూ.180నుంచి రూ.200, క్యాబేజి 70 కిలోల బస్తా రూ.150, వంకాయలు, బీరకాయలు, చిక్కుడు కిలో కేవలం రూ.10 ధరపలికాయి. ఏ కూరగాయల సాగు చేయాలన్నా ఎకరాకు కనీసం రూ.50 వేలనుంచి రూ.లక్ష వరకు వ్యయమవుతోందని చెబుతున్నారు. కోత దశలో బస్తాకు కనీసం రూ.40 వరకు వ్యయమవుతుందని తెలిపారు. ధరలు ఇలా ఉంటే.. సాగుకోసం చేసిన అప్పులు ఎలా తీర్చాలని వాపోతున్నారు. ప్రభుత్వం స్పందించి గిట్టుబాటు ధర కల్పించాలని రైతులు కోరుతున్నారు.

పోక్సో కేసులో నిందితుడికి ఆరేళ్ల జైలు



హరీష్

వెదురుకుప్పం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పోక్సో కేసులో నిందితుడికి ఆరేళ్ల జైలు శిక్ష విధించారు. 2021 జూలై 24వ తేదీన కార్వేటినగరం మండలం అన్నూరుకు చెందిన మేళం హరీష్ అలియాస్ హరి ఓ 17 ఏళ్ల బాలికను బెదిరించి, అత్యాచారం చేశాడు. దీనిపై మరుసటి రోజున బాలిక తండ్రి ఫిర్యాదుతో పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. నిందితుడిని అరెస్టు చేసి, రిమాండుకు తరలించారు. ఈ కేసు విచారణ సోమవారం చిత్తూరు జిల్లా ప్రత్యేక పోక్సో కోర్టులో ముగిసింది. నిందితుడికి ఆరేళ్ల జైలు శిక్షతోపాటు రూ.4వేల జరిమానా, బాధితురాలికి రూ.50వేల పరిహారం చెల్లించాలని చిత్తూరు స్పెషల్ పోక్సో కోర్టు జడ్జి ఎ.శంకర్‌రావు తీర్పు చెప్పారు. ఈ కేసులో నిందితుడిని పట్టుకోవడం నుంచి సాక్షులను కోర్టులో ప్రవేశ పెట్టిన అప్పటి సీఐ చంద్రశేఖర్, ఎస్‌ఐ దస్తగిరితోపాటు స్పెషల్ పీపీ మోహనకుమారి, కోర్టు కానిస్టేబుల్ పలని, రామచంద్రయ్య, కోర్టు మానిటరింగ్ సెల్ ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టరు చంద్రశేఖర్, సిబ్బందిని ఎస్పీ మణికంఠ ప్రత్యేకంగా అభినందించారు.

యూరియా కొరత లేదు

ఏఎంసీ చైర్మన్ జీ.ఎం.రాజు


విలేకరులతో మాట్లాడుతున్న ఏఎంసీ చైర్మన్ జీఎం రాజు

కుప్పం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కుప్పం నియోజకవర్గంలో యూరియా కొరత ఏమాత్రం లేదని కుప్పం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మునిరాజు అన్నారు. స్థానిక వ్యవసాయ మార్కెట్టు కమిటీ యార్డులో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గానికి ఇప్పటికే 230 టన్నుల యూరియా వచ్చిందన్నారు. ఇంకా 40 టన్నులు తెప్పిస్తున్నామని, రైతుందరికీ యూరియా కచ్చితంగా సరఫరా చేస్తామని చెప్పారు. కుప్పంలో రూ.29 లక్షల వ్యయంతో భూసార పరీక్ష కేంద్రాన్ని త్వరలోనే ఏర్పాటు చేస్తామన్నారు. తద్వారా భూసారాన్ని అంచనా వేసి, రైతులకు దానికి తగిన పంటలు, ఎరువులు, మందులు సూచిస్తామన్నారు. తద్వారా పంటల దిగుబడి బాగా జరిగి రైతులు లాభపడతారన్నారు. అలాగే కుప్పం వ్యవసాయ మార్కెట్ యార్డులో అర్ధాంతరంగా ఆగిన శీతలీకరణ గిడ్డంగి నిర్మాణం వెంటనే పూర్తిచేసి రైతులకు అందుబాటులోకి తెస్తామన్నారు. రైతులు పండించే పంటలకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం గిట్టుబాటు ధరలు కల్పిస్తోందని చెప్పారు. పలమనేరుకు మారిన రాజుపేట రోడ్డు చెక్ పోస్టును తిరిగి అదే ప్రాంతానికి మార్చడానికి కృషి చేసి, మార్కెట్ యార్డ్ ఆదాయం పెంచేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఇన్నిరకాల ప్రయోజనాలు రైతులకు కూటమి ప్రభుత్వం సమకూరుస్తుంటే విపక్ష వైసీపీ విషం చిమ్ముతోందని విమర్శించారు. రైతులు ఈ ప్రభుత్వంలో సంతృప్తిగా ఉన్నారని, విపక్షం మాట నమ్మే పరిస్థితి లేదని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఏఎంసీ డైరెక్టర్లు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

యూరియా పంపిణీలో అవకతవకలకు పాల్పడితే చర్యలు

● జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ


కల్లూరు రైతు సేవా కేంద్రంలో తనిఖీ నిర్వహిస్తున్న జిల్లా వ్యవసాయధికారి మురళీకృష్ణ

కల్లూరు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): యూరియా పంపిణీలో ఎలాంటి అవకతవకలకు పాల్పడినా అటువంటి సిబ్బందిపై చర్యలు తప్పవని జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ, పుంగనూరు ఏడీఏ శివకుమార్, మండల వ్యవసాయాధికారి లీలాకుమారి హెచ్చరించారు. పులిచెర్ల మండలం దేవళం పేట, కల్లూరు, వెంకటదాసరపల్లి, కావేటిగారిపల్లి, దిగువపోకలవారి పల్లి రైతు సేవా కేంద్రాల్లో సోమవారం యూరియా పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. కల్లూరు, దేవళంపేట రైతు సేవా కేంద్రాల్లో చేపడుతున్న యూ రియా పంపిణీని జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ సిబ్బందితో కలిసి ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టా దారు పాసుపుస్తకం, ఆధార్ కార్డుతో వచ్చిన రైతులందరికీ నిబంధనల మేరకు యూరియా పంపిణీ చేయాలన్నారు. మండలానికి చేరిన 60 మెట్రి క్ టన్నుల యూరియాలో సోమవారం 53 మెట్రిక్ టన్నుల యూరియా పంపిణీ చేశామన్నారు. సింగిల్ విండో అధ్యక్షులు ధనంజయనాయుడు తదితరులు పాల్గొన్నారు.

నవసమాజ నిర్మాతలు ఉపాధ్యాయులు


ఉపాధ్యాయులను సన్మానించిన మునస్వామి తదితరులు

రామకుప్పం, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): విద్యార్థులను విద్యావంతులుగా, సంస్కారవంతులుగా తీర్చిదిద్దడం ద్వారా నవసమాజ నిర్మాణానికి ఉపాధ్యాయులు తమవంతు కృషి చేస్తున్నారని రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ డైరెక్టరు మునస్వామి, వైస్ఎంపీపీ వెంకట్రామగౌడు తెలిపారు. సోమవారం బల్ల జడ్పీ ఉన్నతపాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని జరిగిన కార్యక్రమంలో మండలంలోని సీనియర్ ఉపాధ్యాయులను వారు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో విజలాపురం సాగునీటి సంఘం అధ్యక్షుడు శ్రీనివాసులురెడ్డి, నాయకులు రామ్మూర్తి, గురప్ప, నాగభూషణం, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌పీఎఫ్ పట్టణ అధ్యక్షుడిగా విజయ్‌కుమార్

పుంగనూరు, సెప్టెంబరు8 (ఆంధ్రజ్యోతి): రాయల్ పీపుల్స్ ఫ్రంట్ పట్టణ అధ్యక్షుడుగా విజయ్‌కుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సోమవారం పట్టణంలోని రాయల్ పీపుల్స్ ఫ్రంట్ సభ్యుల సమావేశంలో జరిగిన ఎన్నికల్లో పట్టణ అధ్యక్షుడుగా సరివేలు విజయ్‌కుమార్‌ను ఏకగ్రీవంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రాయల్ ప్రకటించారు. ఈ సమావేశంలో నాయకులు నానబాల మని, నానబాల కుమార్, రాఘవరాయల్, మనోహర్, పగడాల కిషోర్, మంజునాథ్, గంగాధర్, కుమార్, ఆనంద్, రెడ్డి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ రాయితీలను సద్వినియోగం చేసుకోవాలి


పుంగనూరు రూరల్, సెప్టెంబరు8(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రైతులకు అందిస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని ఉద్యాన శాఖ అధికారి వరప్రసాద్ కోరారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మామిడి కోత పూర్తి కాగానే కొమ్మలను కత్తిరింపు చేయాల్సివుందన్నారు. కొమ్మలు కత్తిరించడం వల్ల తేనె మంచు పురుగు, మంగు చాలావరకు నియంత్రించడానికి అవకాశాలు ఉన్నాయన్నారు. పంట దిగుబడి 15 శాతం పెరుగుతుందన్నారు. 20 ఏళ్ల పైబడిన తోటల్లో దిగుబడి పెంచడానికి ప్రభుత్వం అంట్లు కట్టుకోవడానికి సబ్సిడీ రుణాలు అందిస్తుందన్నారు. వివరాల కోసం రైతు సేవాకేంద్రంలో సంప్రదించాలని కోరారు. అలాగే పూల సాగు, పండ్ల తోటలు, బొప్పాయి, అరటి, కాకర, బీర పంటలు వేయడానికి శ్వాశత పందిళ్ల, ప్యాక్ హౌస్‌లు, పాలిహౌస్‌లు, సాముహిక ఫారంపాండ్లుకు ప్రభుత్వం ప్రోత్సాహాలు అందిస్తున్నట్లు వివరించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం


ఆత్మీయ సమావేశం నిర్వహించుకున్న పూర్వ విద్యార్థులు

పెద్దపంజాణి, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయలపేటలో పూర్వ విద్యార్థుల సమావేశం నిర్వహించారు. రాయలపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1986-87వ విద్యాసంవత్సరంలో 10వ తరగతి చదువుకున్న విద్యార్థులు సోమవారం స్థానిక పాఠశాలలో శ్రీరామా మెడికల్స్ అధినేత రవి ఆధ్వర్యంలో 47 మంది కలుసుకున్నారు. పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఒకరి యోగక్షేమాలను ఒకరు అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాఠశాల, గ్రామ అభివృద్ధికి తమ వంతు సాయం అందించాలని తీర్మానించుకున్నారు.

రైతులకు యూరియా పంపిణీ



బైరెడ్డిపల్లె, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాతపేట, పాతూరునత్తం పంచాయతీ రైతు సేవా కేంద్రాల వద్ద సోమవారం యూరియాను టీడీపీ మండలాధ్యక్షుడు కిశోర్ గౌడు, ప్రధానకార్యదర్శి సుబ్రహ్మణ్యంశెట్టి రైతులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, వ్యవసాయశాఖ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

టపాసుల వాహనం సీజ్



పెనుమూరు, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): అక్రమంగా రూ.1.60 లక్షల విలువైన టపాసులను త రలిస్తున్న మినీ లారీ ని పెనుమూరు ఎస్ఐ వెంకటనరసింహం సీజ్‌చేశారు. సోమవారం మండలంలోని ఉగ్రాణంపల్లి వద్ద జీడీనెల్లూరు నుంచి పీలేరుకు వెళుతున్న వాహనాన్ని పోలీసులు ఆపి తనిఖీ చేశారు. పీలేరుకు చెందిన కె.నవ్యకాంత్ తరలిస్తున్న టపాసులకు బిల్లులు లేకపోవడంతో, వాటిని సీజ్ చేసి కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

బైరెడ్డిపల్లె పీహెచ్‌సీ తనిఖీ



బైరెడ్డిపల్లె, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): బైరెడ్డిపల్లె ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని సోమవారం జిల్లా టీబీ, లెప్రసీ అధికారి డాక్టర్ వెంకటప్రసాద్ తనిఖీచేశారు. ఆస్పత్రిలో రికార్డులు పరిశీలించి సిబ్బందికి పలు సూచనలిచ్చారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు వైద్య సేవలందించడంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ షాలిని, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

నేత్రదానంపై అవగాహన



బైరెడ్డిపల్లె, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): జాతీయ నేత్రదాన పక్షోత్సవ కార్యక్రమంలో భాగంగా సోమవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రం, బాలికోన్నత పాఠశాలలో నేత్ర వైద్యులు డాక్టర్ సురేందర్‌రెడ్డి నేత్రదానంపై అవగాహన కల్పించారు. నేత్రదానం పవిత్రమైనదిగా భావించి సమాజంలో ఆదర్శంగా నిలవాలని, మరణా నంతరం కళ్లు నశించిపోకుండా అంధుల జీవితాల్లో వెలుగు నింపడానికి నేత్రదానాన్ని బాధ్యతగా గుర్తించి అంధత్వాన్ని నివారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి విజయచందర్, డాక్టర్ షాలిని, ఆరోగ్యవిద్యాధికారి సావిత్రి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు అండగా చంద్రన్న


రైతులకు యూరియా పంపిణీ చేస్తున్న రామ్మూర్తి తదితరులు

రామకుప్పం, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు రాష్ట్రంలోని రైతులకు అన్ని విధాలా అండగా నిలుస్తున్నారని తెలుగు యువత నియోజకవర్గ ప్రధానకార్యదర్శి శంకర్‌చలం, పార్టీ విజలాపురం యూనిట్ ఇన్‌చార్జి రామ్మూర్తి తెలిపారు. సోమవారం ఉస్సిగానిపల్లె పంచాయతీ ఆనిగానూరులో వారు రైతులకు యూరియా బస్తాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు బాలాజీ, నాయకులు మణేష్‌నాయుడు, షణ్ముగం, బీరప్ప, లోకేశ్. నవీన్ పాల్గొన్నారు.

వృద్ధురాలి అదృశ్యం


రాజమ్మ

పలమ నేరు, సెప్టెంబరు8 (ఆంధ్ర జ్యోతి) : పలమ నేరు మున్సిపాలిటీ గంటా వూరు గ్రామానికి చెందిన రాజమ్మ (70) సోమవారం తెల్లవారు జాము నుంచి కనిపించడం లేదు. ఆమె కుమారుడు దామోదర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆదివారం రాత్రి ఇంటిలో అందరితో కలిసి నిద్రించిన రాజమ్మ అర్ధరాత్రి దాటిన తరు వాత మూత్ర విసర్జన కోసం వెళ్లి తిరిగి రాలేదు. ఉదయం ఆమె కనిపించక పోవడంతో కుటుంబ సభ్యులు బంధువులు, స్నేహితుల ఇళ్లన్నీ గాలించారు. ఆచూకీ లేక పోవడంతో పోలీసులకు పిర్యాదు చేశారు.

ఉపాధ్యాయవృత్తి పూర్వజన్మ సుకృతం


మాట్లాడుతున్న హెచ్‌ఎం రవికుమార్

బైరెడ్డిపల్లె, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయవృత్తిలో ఉండడం పూర్వజన్మ సుకృతమని పెద్దచెల్లారగుంట జడ్పీఉన్నత పాఠశాల హెచ్‌ఎం రవికుమార్ అన్నారు. మండలంలోని పెద్దచెల్లారగుంట ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులు ఉపాధ్యాయులను సన్మానించి వారి ఆశీర్వచనాలు అందుకున్నారు. ఎస్ఎంసీ కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పలమనేరు పెన్షనర్ల సంఘ కార్యవర్గం ఏర్పాటు


నూతన కార్యవర్గంతో పెన్షనర్లు

పలమనేరు, సెప్టెంబరు8 (ఆంధ్రజ్యోతి) : పలమనేరు పెన్షనర్ల సంఘం నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. సోమవారం పలమనేరు పెన్షనర్ల సంఘ భవనం వద్ద పెన్షనర్లు సమావేశమయ్యారు. ఇప్పటి వరకు ఉన్న పెన్షనర్ల సంఘ కార్యవర్గ పదవీ కాలం ముగిసినందున నూతన కార్యవర్గాన్ని ఎన్నుకొన్నారు. ఈ కార్యవర్గం మూడేళ్లపాటు కొనసాగనుంది. సంఘ అధ్యక్షులుగా రత్నారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా గురుమూర్తి, సహఅధ్యక్షులుగా నాగభూషణం, ట్రెజరర్‌గా దవణముని, ఉపాధ్యక్షులుగా సిద్దమనోహర్, విజయకుమార్‌రెడ్డి, సుబ్రహ్మణ్యం, గోవింద రాజులుశెట్టి, పొన్నుడి, జాయింట్ సెక్రటరీలుగా పాపయ్య, పుష్పాల వెంకటేశ్వర్లు, శ్యామరాజు, మురళీధరపిళ్లె, వేణుగోపాల్, ఈసీ మెంబర్లుగా విజయకుమార్, పీటర్ త్యాగరాజు, భాస్కర్, కస్తూరి, సత్యనారాయణ, వెంకటరమణ, జగన్నాథం, సుబ్రహ్మణ్యం, శేఖర్, శ్రీనివాసులును ఎన్నుకొన్నారు. ఈ కార్య క్రమంలో జిల్లా సంఘం అధ్యక్షులు నాగరాజు, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆత్మానంద నాయుడు, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ దశరథనాయుడు, జిల్లాకార్యవర్గ సభ్యులు క్రిష్ణమ నాయుడు మాట్లాడుతూ అందరూ ఐక్యంగా కొనసాగితే ప్రభుత్వం నుంచి తమకు రావలసిన అన్ని బకాయిలు రాబట్టుకోవచ్చని అన్నారు. ప్రభుత్వం అడిషనల్ క్వాంటమ్ పునరుద్ధరిం చాలని కోరారు. ఈ కార్యక్రమంలో పెన్షనర్లు సంఘ గౌరవాధ్యక్షులు నల్లారెడ్డి, సుబ్బరాజశెట్టి, దొరస్వామి, సూర్యనారాయణరెడ్డి, రాజన్న, కన్నయ్య, పురుషోత్తం, వెంకటరమణ, లక్ష్మమ్మ, ప్రభాకర్‌రావు, ఎల్లప్ప, రవివర్మారెడ్డి పాల్గొన్నారు.

నేతాజీ రోడ్డు విస్తరణ పనులు ప్రారంభం


ప్రారంభమైన నేతాజీ రోడ్డు విస్తరణ పనులు

కుప్పం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కుప్పం పట్టణంలో ప్రధాన రహదారి అయిన నేతాజీ రోడ్డు విస్తరణ పనులను సోమవారం ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ ఆధ్వర్యంలో ప్రారంభించారు. కడా కార్యాలయంనుంచి ప్రారంభించి కృష్ణగిరి కూడలి మీదుగా టీడీపీ కార్యాలయం వరకు పనులు ప్రారంభమయ్యాయి. ఈ పనులను ప్రారంభించిన ఎమ్మెల్సీ మాట్లాడుతూ కుప్పం పురపాలక సంఘం అభివృద్ధికి నేతాజీ రోడ్డు విస్తరించడం చాలా అవసరమని పేర్కొన్నారు. రోడ్డును అభివృద్ధి చేసి వీధి దీపాలు, డివైడర్లతో సుందరంగా రోడ్డును రూపొందిస్తామని చెప్పారు. ఆదర్శ కుప్పం మున్సిపాలిటీ రూకల్పనకు ప్రజలందరూ సహకరించాలని పిలుపునిచ్చారు. విస్తరణ పనుల్లో భాగంగా ప్రథమంగా ఆర్ అండ్ బీ పాత భవనం ప్రహరీని తొలగించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సెల్వరాజ్, కమిషనర్ వి.శ్రీనివాసరావు, టీడీపీ మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్, నాయకులు కన్నన్, జిమ్ దాము, జాకీర్, సత్యేంద్రశేఖర్, సతీశ్, శ్యామ, వేణు పాల్గొన్నారు.

సహకార సంఘ సేవలు సద్వినియోగం చేసుకోండి


సహకార సంఘ సేవలను వివరిస్తున్న సీవో రామరాజు

పెద్దపంజాణి, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రాథమిక సహకార సంఘ సేవలను రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని ప్రాథమిక సహకార సంఘ సీఈఓ రామరాజు తెలిపారు. సోమవారం పెద్దపంజాణి మండల కేంద్రంలోని ప్రాథమిక సహకార సంఘంలో నూతనంగా ఏర్పడ్డ కమిటీతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తు తం వ్యవసాయ, వ్యవసాయేతర రుణాలను ప్రభుత్వ రూ.5 లక్షల వరకు పరిమితి పెంచిందని తెలిపారు. అర్హులైన రైతులకు రుణాలు అందజేస్తామ న్నారు. బంగారంపై 89 పైసలు వడ్డీకి రుణాలు అందిస్తున్నామని తెలి పారు. రైతుల సౌకర్యార్థం ఎరువుల దుకాణాన్ని కూడా ప్రారంభిస్తా మన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక సహకార సంఘ చైర్మన్ శ్రీరాములు, డైరెక్టర్లు గంగప్ప, హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ స్థాయి నుంచి కమిటీలు ఏర్పాటు చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న వైసీపీ నాయకులు

పుంగనూరు, సెప్టెంబరు8(ఆంధ్రజ్యోతి): గ్రామస్థాయి నుంచి కమిటీలు ఏర్పాటు చేసి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని వైసీపీ నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక జేడీఎం కళ్యాణ మండపంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు నాయకులు, కార్యకర్తలు సిద్ధం కావాల్సివుందన్నారు. అనర్హత పేరుతో పింఛన్లు తొలగించడానికి ప్రభుత్వం కుట్ర పన్నుతోందని ఆరోపించారు. వైసీపీ నాయకులు, కార్యకర్తలపై తప్పుడు కేసులు బనాయిస్తున్న విషయాన్ని నిలదీయాలని సూచించారు. ఈ సమావేశంలో రాష్ట్ర మహిళా కార్యదర్శి అనీషారెడ్డి, ఎంపీపీ భాస్కర్‌రెడ్డి, నాయకులు పెద్దిరెడ్డి, చెంగారెడ్డి, నాగరాజరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, చంద్రారెడ్డియాదవ్, అమరనాథ్‌రెడ్డి, నరసంహులు, రమణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరిస్తాం


రొంపిచెర్ల ఎంపీడీవో కార్యాలయంలో టీడీపీ నాయకులు

రొంపిచెర్ల, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలు పరిష్కరిస్తామని కురబ కార్పొరేషన్ డైరెక్టరు ఉయ్యాల రమణ అన్నారు. ఆయన సోమవారం తహ సీల్దార్, ఎంపీడీవో కార్యాలయాల ను సందర్శించారు. పిం ఛన్లు, రేషన్‌కార్డులు, తాగునీరు తదితర సమస్యల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. న్యాయమైన సమస్యలు త్వరగా పరిష్కరించేలా చూడాలని అధి కారులను కోరారు. తాటికుంట చెరువు అన్యా క్రాంతంపై తహసీల్దార్ అమరనాథ్‌కు ఫిర్యా దు చేశారు. ఈకార్యక్రమంలో నాయకులు అమరనాథరెడ్డి, రఘునాథ్, మదనమోహన్ రెడ్డి, నాగరాజ, చెంగల్‌రెడ్డి పాల్గొన్నారు.

అనాథ శవానికి పోలీసుల అంత్యక్రియలు



పుంగనూరు రూరల్, సెప్టెంబరు8(ఆంధ్రజ్యోతి): అనాథ శవానికి పోలీసులు సోమవారం అంత్యక్రియలు నిర్వహించారు. పట్టణంలో భిక్షాటన చేసుకుని జీవనం సాగిస్తున్న ఓ యాచకుడు మృతిచెందడంతో స్టేషన్ ఏఎస్ఐ అశ్వర్థనారాయణ మున్సిపల్ సిబ్బందిని పిలిచి సొంత ఖర్చులతో అంత్యక్రియలు నిర్వహించి మానత్వం చాటుకున్నారు.

వైభవంగా సుబ్రహ్మణ్యస్వామి సోమవారోత్సవాలు


ఆలయం వద్ద భక్తుల కోలాహలం, అలంకరణలో సుబ్రహ్మణ్యస్వామి

రామకుప్పం, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): రామకుప్పం పట్టణ శివార్లలోని శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి వార్షిక సోమవారోత్సవాల్లో భాగంగా రెండో సోమవారోత్సవం వైభవంగా జరిగింది. చంద్రగ్రహణ అనంతరం తెల్లవారుజామున ఆలయాన్ని శుద్ధి చేశారు. ఆలయ పురోహితులు కృష్ణమూర్తి, వాసులు స్వామి వారి మూలమూర్తికి ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించి, వెండి కవచధారణతో విశేష పుష్పాలంకరణ చేశారు. అనంతరం నెమలి వాహనంపై శ్రీవల్లీ, దేవసేన, సుబ్రహ్మణ్యస్వామి ఉత్సవర్లకు పురోహితుడు హరినాథ్ విశేషపూజలు నిర్వహించారు. ఉదయం ఆరు గంటల నుంచే భక్తులు ఆలయం వద్దకు రాసాగారు. వందలాదిగా తరలివచ్చిన భక్తులు తొలుత ఆలయ ఈశాన్య దిక్కున గల నాగులపుట్ట వద్ద పూజలు చేసి పాలు, పండ్లు సమర్పించారు. సంతానలేమితో బాధపడుతున్న దంపతులు అక్కడి రావి, వేప వృక్షాలకు పూజలు చేసి కొమ్మలకు జోలెలు కట్టారు. అనంతరం భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. కళ్ళు, చెవులు రుగ్మతలతో బాధపడుతున్న వారు వెండితో చేసిన కళ్ళు, చెవులు, సర్పదోషం ఉన్నవారు నాగపడిగలను స్వామి వారి హుండీలో వేసి మొక్కుకున్నారు. మొక్కులు నెరవేరిన భక్తులు స్వామివారికి ప్రాకారోత్సవాలు నిర్వహించారు. అదేవిధంగా ఆలయ ప్రాంగణంలోని నాగులముద్దమ్మ, శనీశ్వరస్వామి, వినాయకాలయం, పద్మావతి, వేంకటేశ్వరస్వామి ఆలయాలు కూడా భక్తజనంతో కిటకిటలాడాయి. సాయంత్రం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పంబవాయిద్యాల నడుమ పట్టణ వీధుల్లో ఊరేగింపుగా వచ్చి కుండకావళ్లు, పూలకావళ్లు, నెమలి కావళ్లు, వీపుతేర్లు సమర్పించారు. పలువురు భక్తులు దవడలకు శూలాలు, శరీరాలపై సూదులతో నిమ్మకాయలు గుచ్చుకుని వచ్చి స్వామి వారికి మొక్కులు చెల్లించారు. ఆలయ అభివృద్ధి కమిటీ వారు దాతల సహకారంతో భక్తులకు అన్నప్రసాదాలను పంపిణీ చేశారు. కుప్పం గ్రామీణ సీఐ మల్లేష్‌యాదవ్ ఆధ్వర్యంలో రామకుప్పం ఎస్ఐ వెంకటమోహన్, ట్రైనీ ఎస్ఐ మధుసూదన్ తమ సిబ్బందితో ఎక్కడికక్కడ ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తూ బందోబస్తు నిర్వహించారు.

పేదరాలి ఇంటికి విద్యుత్ కనెక్షన్


లక్ష్మమ్మకు విద్యుత్తు మీటరు అందజేస్తున్న కన్నన్ తదితరులు

కుప్పం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కుప్పం పురపాలక సంఘం 9వ వార్డు పరిధిలో నివాసముంటున్న పేద మహిళ తన ఇంటికి ఏళ్లతరబడి విద్యుత్ కనెక్షన్ లేకుండా ఇబ్బంది పడుతోంది. ఈ విషయం తెలుసుకున్న స్థానిక టీడీపీ నాయకుడు, 11వ క్లస్టర్ ఇన్‌చార్జి కన్నన్ రెస్కో అధికారులతో సంప్రదించి లక్ష్మమ్మ ఇంటి కనెక్షన్ కోసం చెల్లించాల్సిన నగదు చెల్లించి ఆమె ఇంటికి సోమవారం విద్యుత్ కనెక్షన్ ఇప్పించారు. ఈ కార్యక్రమంలో 9వ వార్డు టీడీపీ బూత్ ఇన్‌చార్జి గని తదితరులు పాల్గొన్నారు.

కొరత లేకుండా యూరియా సరఫరా చేస్తాం


రొంపిచెర్లలో యూరియా బస్తాల పంపిణీలో ఏవో శ్రావణి

రొంపిచెర్ల, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): రైతులకు కొరత లేకుండా యూరియా సరఫరా చేస్తామని చిత్తూరు జిల్లా వ్యవసాయాధికారి మురళీక్రిష్ణ అన్నారు. ఆదివారం బొమ్మయ్యగారిపల్లె రైతు భరోసా కేంద్రాన్ని సందర్శించారు. రికార్డులు పరిశీలించారు. స్టాకు వివరాలు తెలుసుకున్నారు. మండలానికి వెయ్యి బస్తాలు ఐదు రైతు సేవా కేంద్రాలలో అందుబాటులో ఉంచామని వ్యవసాయాధికారి శ్రావణి తెలిపారు. గానుగచింత, బొమ్మయ్యగారిపల్లె, బండకింద పల్లె, రొంపి చెర్ల, పెద్దమల్లెల రైతు సేవా కేంద్రాలలో సోమవారం పంపిణీ చేస్తామన్నారు. బస్తా యూరియా రూ 267 ప్రకారం రైతుకు ఒక బస్తా ఇస్తామన్నారు. ఏడీఏ శివకుమార్, ఏవో శ్రావణి పాల్గొన్నారు.

శివ, కేశవులకు ప్రత్యేక పూజలు


చెన్నకేశస్వామికి పూజలు

రొంపిచెర్ల, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రొంపిచెర్ల కట్ట కింద శివాల యం, చెన్న కేవ స్వామి ఆల యాలు సోమ వారం భక్తుల తో కళ కళలా డాయి. చంద్ర గ్రహణం కారణంగా దోషాలు నివృత్తి చేసు కునేందుకు భక్తులు ఆలయాలకు తరలివచ్చారు. మునిరాజశర్మ, హరిస్వామి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

ద్విచక్ర వాహనం ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలు

పుంగనూరు రూరల్, సెప్టెంబరు8(ఆంధ్ర జ్యోతి): రోడ్డుపై నిలుచుని ఉన్న ఓ వ్యక్తిని ద్విచక్రవాహనం ఢీకొనడంతో ఆ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. బాధితుడి కథనం మేరకు.. మండలంలోని భీమగానిపల్లె పంచాయతీ గుట్టపల్లెకు చెందిన మల్లన్న కుమారుడు నారాయణ(37) కోర్టు బైపాస్‌రోడ్డులో నిలుచుని ఉండగా ద్విచక్రవాహనం అతి వేగంగా వచ్చి ఢీకొంది. నారాయణ తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు అతడిని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

రాయితీపై జొన్న మొక్కజొన్న విత్తనాలు

రొంపిచెర్ల, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): జొన్న, మొక్కజొన్న విత్తనాలను 75 శాతం రాయితీలో రైతులకు పపిణీ చేస్తున్నట్లు పశువైద్యాధికారి ఉషా తెలిపారు. ఆమె సోమవారం స్థానిక కార్యాలయంలో మాట్లాడుతూ మండలానికి 4300 కేజీల జొన్నలు, 2600 కిలోల మొక్కజొన్నలు వచ్చాయన్నారు. రొంపిచెర్ల, గానుగ చింత, మోటుమల్లెల, పెద్దమల్లెల, చిచ్చిలివారిపల్లె పశువైద్యశాలలో జొన్నలు కేజీ రూ.23, మొక్కజొన్న కేజీ రూ.17 చొప్పున ఒక్కో రైతుకు20 కిలోలు ఇస్తామని వివరించారు.

చిత్తూరు
జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

తల్లిదండ్రుల తరువాత గురువే మార్గదర్శి

● ఎమ్మెల్యే మురళీమోహన్



ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే మురళీమోహన్, ధరణీప్రసాద్

బంగారుపాళ్యం, సెప్టెంబర్ 8(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరికీ తల్లిదండ్రుల తరువాత ఉపాధ్యాయుడే మార్గదర్శి అని ఎమ్మెల్యే మురళీమోహన్ అన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో గురుపూజోత్సవాన్ని పురస్కరించుకుని ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా స్థాయిలో ఉత్తమ విద్యాశాఖ అధికారిగా నాగేశ్వరావును, మండలస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన మురళీ, కృష్ణకుమారి, మాధురి, పద్మలోచన, భాస్కరయ్య, రామకృష్ణయ్యలను ఎమ్మెల్యేతో కలిసి టీడీపీ మండల అధ్యక్షుడు ఎన్పీ ధరణీప్రసాద్ దుశ్శాలువాలు కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ విద్యావ్యవస్థను మెరుగుపరచడానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు జనార్ధన్‌గౌడ్, హేమచంద్ర నాయుడు, లోకనాథ నాయుడు, మోహన్ నాయుడు, బాలసుబ్రమణ్యం, మాధవ నాయుడు, రమేష్, హరిప్రసాద్, సూరి నాయుడు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

అన్నదానానికి రూ.లక్ష విరాళం



దాతకు రశీదు అందిస్తున్న సూపరింటెండెంట్ కోదండపాణి

ఐరాల(కాణిపాకం), సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): కాణిపాక క్షేత్రంలో నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమానికి హైదరాబాద్‌కు చెందిన రామకృష్ణ సోమవారం రూ.1,00,000 విరాళంగా అందించారు. విరాళదాతను సూపరింటెండెంట్ కోదండపాణి ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. దర్శనానంతరం దాతను అలంకార మండపంలో వేద మంత్రాలతో ఆశీర్వదించి స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపికను అందించారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ బాలాజీనాయుడు తదితరులు పాల్గొన్నారు.

కళాశాల అధ్యాపకులకు సన్మానం



జూనియర్ కళాశాల అధ్యాపకులను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్ హేమలత

పాలసముద్రం, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలసముద్రం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కళాశాలలో పనిచేస్తున్న అధ్యాపకులు రమ్య, సుశీల, శోభారాణి, సూర్య, శ్రీనివాసులు, భారతిలను ప్రిన్సిపాల్ హేమలత శాలువలు కప్పి, జ్ఞాపికలను అందజేసి సన్మానించారు. అధ్యాపకులతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

వేణుగోపాలస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



కార్వేటినగరం వేణుగోపాలస్వామి ఆలయంలో హుండీ లెక్కిస్తున్న సిబ్బంది

వెదురుకుప్పం, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరంలోని రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఆలయాన్ని సోమవారం వేకువ జామున తెరిచారు. ఆదివారం చంద్రగ్రహణం సందర్భంగా మూసివేసిన విషయం తెలిసిందే. తలుపులు తెరిచాక ప్రత్యేక పూజాది కార్యక్రమాలను నిర్వహించి, భక్తులను దర్శనానికి అనుమతించారు. కార్వేటినగరం వేణుగోపాల స్వామి ఆలయం హుండీ లెక్కింపు ద్వారా రూ.1,06,622, ఇదే మండలంలో అలత్తూరులోని వరద వెంకటేశ్వరస్వామి హుండీ లెక్కింపు ద్వారా రూ.2240 వచ్చిందని టెంపుల్ ఇన్‌స్పెక్టరు సురేష్‌కుమార్ సోమవారం తెలిపారు.

బాలికలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



ఎస్‌ఆర్‌పురంలో ఐసీడీఎస్ ఉద్యోగులు, విద్యార్థులు, ఉపాధ్యాయుల ర్యాలీ

శ్రీరంగరాజపురం, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): బాలికలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని కార్వేటినగరం సీడీపీవో శోభారాణి తెలిపారు. ఎస్‌ఆర్ పురం జడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం పిల్లలకు పౌష్టికాహారం, ఆరోగ్యం, చట్టాలపై అవగాహన కల్పించారు. సమావేశంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రోజారమణి, ఉపాధ్యాయులు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నగరపాలక సంస్థ పీజీఆర్‌ఎస్‌కు 12 ఫిర్యాదులు



అర్జీని పరిశీలిస్తున్న కమిషనర్ నరసింహప్రసాద్

చిత్తూరు అర్బన్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): చిత్తూరు నగరపాలక కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్‌ఎస్‌కు నగరం నలుమూలల నుంచి 12 వినతులు అందినట్లు కమిషనర్ నరసింహప్రసాద్ చెప్పారు. సోమవారం నగరపాలక కార్యాలయ ఆవరణలో నిర్వహించిన పీజీఆర్‌ఎస్ కార్యక్రమంలో ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఇంజనీరింగ్‌కు 6, పింఛన్‌కు 2, టౌన్‌ప్లానింగ్‌కు 2, హెల్త్‌కు 1, టిడ్కో 1 చొప్పున అర్జీలు అందాయి. ఈ కార్యక్రమంలో ఎంఈ వెంకట్రామిరెడ్డి, ఎంహెచ్‌వో లోకేష్, ఏసీపీ నాగేంద్ర, ఇతర అధికారులు పాల్గొన్నారు.

15 నుంచి యూటీఎఫ్ రణభేరి



రణభేరి పోస్టర్ ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నాయకులు

చిత్తూరు సెంట్రల్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): విద్యారంగం, ఆర్థికపరమైన సమస్యల పరిష్కారానికై ఈనెల 15 నుంచి 19వ తేదీ వరకు యూటీఎఫ్ ఆధ్వర్యంలో రణభేరి నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి రమణ, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సోమశేఖర్‌నాయుడు, మణిగండన్ తెలిపారు. ఈ మేరకు సోమవారం సంఘం జిల్లా కార్యాలయంలో పోస్టర్ విడుదల చేశారు. నాయకులు మాట్లాడుతూ బోధనేతర పనిభారం, పీఆర్‌సీ, డీఏ విడుదల, ఐఆర్ ప్రకటన డిమాండ్లపై ఈ నెల 25న విజయవాడలో పెద్దఎత్తున రణభేరి బహిరంగ సభ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. పోస్టర్ ఆవిష్కరణలో సంఘం నాయకులు రెహనాబేగం, బాషా, ఏకాంబరం, పార్థసారథి, భానుప్రకాష్, రాజేష్‌కుమార్, సర్దార్, మధు తదితరులు పాల్గొన్నారు.

కారు ఢీకొని కూలిన ప్రహరీ



శ్రీకృష్ణ భజన మందిర ప్రహరీగోడను ఢీకొట్టిన కారు

పాలసముద్రం, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలసముద్రంలో వున్న శ్రీకృష్ణ భజన మందిరం ప్రహరీగోడను ఆదివారం అర్ధరాత్రి కర్ణాటక రిజిస్ట్రేషన్ కలిగిన ఓకారు ఢీకొట్టింది. దీంతో ప్రహరీగోడ పాక్షికంగా కూలిపోయింది. మండలంలోని తిరుమలరాజుపురం గ్రామానికి చెందిన భార్యాభర్తలు బెంగళూరులో నివాసం ఉంటారు. వారు అక్కడ నుంచి తిరుమల వెళ్లి శ్రీవారిని దర్శించుకుని తిరుగు ప్రయాణంలో స్వగ్రామానికి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో భార్యాభర్తలకు స్వల్ప గాయాలయ్యాయి. వారు ప్రథమ చికిత్స చేయించుకుని బెంగళూరు వెళ్లిపోయారు. కృష్ణ భజన మందిరంలో అయ్యప్ప స్వాములు 15 రోజులుగా అయ్యప్ప మాలధారణ చేసి అక్కడే బస చేస్తున్నారు. ఆదివారం రాత్రి వర్షం కురవడంతో అయ్యప్ప భక్తులంతా వారివారి స్వగృహాలకు వెళ్లిపోయారు. అయ్యప్ప భక్తులు గుడి ఆవరణలోనే నిద్రించివుంటే ప్రహరీగోడ కూలిపడడం వల్ల పెద్ద ప్రమాదమే జరిగి వుండేది. తమను అయ్యప్పస్వామే రక్షించారని అయ్యప్ప భక్తులు అంటున్నారు.

బ్లాక్‌లో యూరియా విక్రయాలను ప్రభుత్వం అడ్డుకోవాలి: సీపీఐ



ధర్నా నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు

చిత్తూరు రూరల్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): రైతులకు రాష్ట్ర ప్రభుత్వం సకాలంలో యూరియా సరఫరా చేయాలని, బ్లాక్‌లో విక్రయాలను అడ్డుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజు డిమాండ్ చేశారు. సోమవారం సీపీఐ నాయకులు చిత్తూరు అర్బన్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా రైతులకు యూరియా సరఫరా చేయడంతో ప్రభుత్వం వైఫల్యం చెందిందన్నారు. కొంతమంది యూరియా కంపెనీ యజమానులు అక్రమంగా నిల్వ ఉంచి అధిక ధరలకు బ్లాక్‌లో విక్రయిస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సీపీఐ నాయకులు గోపీనాథ్, కోదండయ్య, కుమారి, కవిత, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవం



'అ' అక్షరం ఆకారంలో కూర్చొన్న విద్యార్థులు

బంగారుపాళ్యం, సెప్టెంబర్ 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని కీరమంద జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం అక్షరాస్యతా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల హెచ్‌ఎం కృష్ణవేణి మాట్లాడుతూ ప్రజల అక్షరాస్యతపై దేశాభివృద్ధి ఆధారపడి ఉంటుందని తెలిపారు. అందుకే మన ప్రభుత్వాలు 14 సంవత్సరాలలోపు బాలబాలికలకు ఉచిత నిర్బంధ విద్యనందిస్తున్నాయని తెలిపారు. సాంఘికశాస్త్ర ఉపాధ్యాయిని భారతి మాట్లాడుతూ యూనిస్కో సూచనల మేరకు అన్నిదేశాల్లో సెప్టెంబర్ 8వ తేదీన ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తారని తెలిపారు. అనంతరం పాఠశాల విద్యార్థులు 'అ' అక్షరం ఆకారంలో కూర్చొని అక్షరాస్యత ప్రాధాన్యత తెలిపారు. ఉపాధ్యాయులు షంషీర్‌ఖాన్, పట్టాభి, విజయలక్ష్మి, దేవేంద్ర, పవిత్ర, గౌతమి, పూర్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీహరిపురం ఎంపీటీసీ సతీమణి మృతి



గీత (ఫైల్‌ఫొటో)

విజయపురం, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీహరిపురం ఎంపీటీసీ లక్ష్మీపతిరాజు సతీమణి గీత(63) సోమవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆమె మృతికి పలువురు టీడీపీ నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. బుధవారం జంబాడ సమీపంలో నెహ్రూనగర్‌లో 11 గంటలకు దహనక్రియలు జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు.

డీసీసీబీ చైర్మన్‌ను కలిసిన టౌన్ బ్యాంకు చైర్మన్



డీసీసీబీ చైర్మన్‌ను కలిసిన కాండ్ర రమేష్ నాయుడు తదితరులు

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు చైర్మన్ అమాస రాజశేఖర్‌రెడ్డిని సోమవారం బ్యాంకు ప్రధాన కార్యాలయంలోని ఆయన చాంబర్‌లో చిత్తూరు కో-ఆపరేటివ్ టౌన్ బ్యాంకు చైర్మన్ కాండ్ర రమేష్ నాయుడు మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి సన్మానించారు. ఇటీవల ప్రభుత్వం టౌన్ బ్యాంకుకు చైర్మన్‌గా కాండ్ర రమేష్ నాయుడితో పాటు నలుగురు డైరెక్టర్లతో ఫైవ్‌మెన్ పర్సన్ ఇన్‌చార్జి కమిటీని నియమించిన విషయం తెలిసిందే. చైర్మన్‌ను కలిసినవారిలో సురేష్‌బాబు, అన్సర్, నరసింహులు తదితరులు ఉన్నారు.

టపాసుల వాహనం సీజ్



సీజ్ చేసిన వాహనంతో పోలీసులు

పెనుమూరు, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): అక్రమంగా రూ.1.60 లక్షల విలువైన టపాసులను తరలిస్తున్న మినీ లారీని పెనుమూరు ఎస్‌ఐ వెంకటనరసింహం సీజ్‌చేశారు. సోమవారం మండలంలోని ఉగ్రాణంపల్లి వద్ద జీడీనెల్లూరు నుంచి పీలేరుకు వెళుతున్న వాహనాన్ని పోలీసులు ఆపి తనిఖీ చేశారు. పీలేరుకు చెందిన కె.నవ్యకాంత్ తరలిస్తున్న టపాసులకు బిల్లులు లేకపోవడంతో, వాటిని సీజ్ చేసి కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు.

ఆలపాకంలో పారిశుధ్య చర్యలు



వీధుల్లో బ్లీచింగ్ చల్లుతున్న సర్పంచ్, పారిశుధ్య కార్మికులు

విజయపురం, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆలపాకంలో సర్పంచ్ బాబు సోమవారం పారిశుధ్య చర్యలు నిర్వహించారు. వీధుల్లో చెత్తకుప్పలు తొలగించి, మురుగునీరు నిలువ ఉన్న ప్రదేశంలో బ్లీచింగ్ చల్లారు. బురదమయంగా ఉన్న వీధుల్లో మట్టితోలి చదును చేశారు. గ్రామంలో, హరిజనవాడ వీధుల్లో పారిశుధ్య చర్యలు నిర్వహించారు.



వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో సోమవారం నృత్య ప్రదర్శన చేస్తున్న కళాకారులు

అల్లుకున్న నిర్లక్ష్యం

● రోడ్డును కప్పేస్తున్న ముళ్ల చెట్లు
● ప్రమాదాల బారిన గ్రామస్థులు



రోడ్డును అల్లేసిన ముళ్ల పొదలు - సేఫ్టీగోడ నిర్మించకపోవడంతో ప్రమాదకరంగా ఉన్న రోడ్డు

చిత్తూరు రూరల్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): చిత్తూరు రూరల్ మండలంలోని తాళంబేడు గ్రామం నుంచి హరిజనవాడకు, పచ్చనపల్లి, బీఎన్‌ఆర్‌పేటకు వెళ్లే మార్గంలో రోడ్డును ముళ్లపొదలు కప్పేయడంతో ప్రమాదకరంగా మారింది. రోడ్డు సగానికిపైగా ముళ్లపొదలు రావడంతో రెండు వాహనాలు ఒకేసారి వెళ్లేందుకు వీలులేని పరిస్థితి నెలకొంది. రోడ్డు మలువు వద్ద ఎదురుగా వచ్చే వాహనాలు కనపడకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. దీనిపై పంచాయతీ కార్యదర్శులకు విన్నవించినా ప్రయోజనం లేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డుకు ఇరువైపులా పెద్ద వంక ప్రవహిస్తోంది. దీనికి సేఫ్టీగోడ నిర్మించకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి సేఫ్టీగోడ నిర్మించాలని, ముళ్ల పొదలు తొలగించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

యూరియా కొరత ఉందంటూ వైసీపీ డ్రామా: టీడీపీ



మీడియాతో మాట్లాడుతున్న సప్తగిరి ప్రసాద్

చిత్తూరు సిటీ, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో యూరియా కొరత ఉందంటూ వైసీపీ నాయకులు సరికొత్త డ్రామాకు తెరలేపారని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్ అన్నారు. సోమవారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈనెల 9వ తేదీన వైసీపీ నేతలు 'రైతు పోరు' కార్యక్రమానికి పిలుపునివ్వడం హాస్యాస్పదంగా ఉందన్నారు. మాజీ సీఎం జగన్ రైతులను రెచ్చగొట్టడానికి, తన పేటీఎం బ్యాచ్‌తో తప్పుడు పోస్టులు చేస్తూ, తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని ఆరోపించారు. అనంతపురంలో ఈనెల 10వ తేదీ 'సూపర్ సిక్స్-సూపర్ హిట్' కార్యక్రమానికి ప్రజల నుంచి వస్తున్న ఆదరణ చూసి తట్టుకోలేక సరికొత్త నాటకానికి తెరలేపుతున్నారని చెప్పారు. వైసీపీ కార్యకర్తలే పురుగుల మందు డబ్బాలో మద్యం పోసుకుని తాగి, రైతులు ఆత్మహత్యాయత్నం చేసుకున్నట్లు పెద్ద ఎత్తున సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారని, పోలీసులు వారి కుట్రను బయటపెట్టారని అన్నారు. అధికారంలో ఉన్నప్పుడు ఏనాడూ రైతులను పట్టించుకోని జగన్ ఈ రోజు వారి పక్షాన మొసలికన్నీరు కార్చుతున్నారని ఎద్దేవా చేశారు. మామిడి రైతుల పరామర్శ పేరుతో బంగారుపాళ్యంలో మామిడిపంటను రోడ్డుపై పోసి ట్రాక్టర్లతో తొక్కించారని, జగన్‌కు రైతుల గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. యూరియా కొరతపై, ఉల్లి రైతుల గిట్టుబాటు ధర గురించి చర్చించేందుకు దమ్ముంటే జగన్ అసెంబ్లీకి రావాలని సవాల్ విసిరారు. కార్యక్రమంలో నేతలు ధరణీప్రకాష్, గోవిందరాజులు, బాలకృష్ణ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం



ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న అధికారులు, ఉపాధ్యాయులు

నింద్ర, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): నేటి సమాజంలో ఉపాధ్యాయ వృత్తి ఎంతో ఉన్నతమైందని డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసులు అన్నారు. సోమవారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో ఉపాధ్యాయ దినోత్సవం జరిగింది. ఆయన మాట్లాడుతూ సమాజంలో ఏ స్వార్థం లేకుండా విద్యార్థులను ఉన్నత శిఖరాల్లో ఉంచి ఆనందించే వ్యక్తి ఉపాధ్యాయుడని కొనియాడారు. అనంతరం మండలంలోని ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలు మాధవి(కావనూరు), వెంకటేశ్వర్లు(కావనూరు), లక్ష్మీనరసింహులు(మిట్ట కండ్రిగ), కృష్ణయ్య(ఇరుగువాయి), రాధిక(ఎంసీ కండ్రిగ), బాలకృష్ణ(ఆరూరు దళితవాడ)లను శాలువలతో ప్రశంసాపత్రాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు వసుమతి దేవి, శ్రీధర్‌రాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సాయిబాబాకు పూజలు



సత్యసాయిబాబా చిత్రపటాన్ని ఊరేగిస్తున్న భక్తులు

చిత్తూరు కల్చరల్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): గిరింపేట సత్యసాయి సంస్థాన్‌లో సోమవారం బాబా శత జయంతి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాలు నవంబరు నెలాఖరు వరకు నిర్వహించనున్నామని సత్యసాయి సేవాసమితి జిల్లా అధ్యక్షులు యస్.మధుసూదనం, నగర కన్వీనర్ ప్రభాకర్ నాయుడు తెలియజేశారు. ఇందులో భాగంగా బాబాకు ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. అనంతరం బాబా చిత్రపటాన్ని ప్రత్యేక పల్లకిలో ఉంచి గిరింపేట పురవీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో సత్యనారాయణ, పాండురంగం, దేవరాజులు, గజేంద్రరెడ్డి పాల్గొన్నారు.

857 బస్తాల యూరియా స్టాకు రాక



సిద్దేశ్వరకొండలో రైతులకు యూరియా సరఫరాను తనిఖీచేసిన తహసీల్దార్ శ్రీనివాసులు

గంగాధరనెల్లూరు, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాలుగు రైతుసేవా కేంద్రాలకు 857 బస్తాల యూరియా స్టాకు వచ్చిందని తహసీల్దార్ శ్రీనివాసులు, మండల వ్యవసాయాధికారి భవాని తెలిపారు. మండలంలోని వీరకనెల్లూరు, సిద్ధేశ్వరకొండ, వేపంజేరి, మహదేవమంగళం గ్రామాల్లోని రైతుసేవా కేంద్రాల్లో సోమవారం రైతులకు యూరియా బస్తాలను వ్యవసాయశాఖ, సచివాలయ సిబ్బంది పంపిణీ చేశారు. ఈ పంపిణీ కార్యక్రమాన్ని తహసీల్దార్ తనిఖీ చేశారు.

● శ్రీరంగరాజపురం: ఎస్‌ఆర్‌పురం మండలం, పిళ్లారికుప్పం రైతు భరోసా కేంద్రంలో తహసీల్దార్ లోకనాథం పిళ్లై, వ్యవసాయాధికారి కుసుమ రైతులకు యూరియా పంపిణీ చేశారు. వ్యవసాయ శాఖ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

● నింద్ర: నింద్రలో పీఏసీఎస్ చైర్మన్ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో రైతులకు ఎరువులు పంపిణీ చేశారు. తహసీల్దార్ శేషగిరిరావు, సీఐ భాస్కర్, వ్యవసాయ అధికారి తులసి, నాయకులు రవినాయుడు తదితరులు పాల్గొన్నారు.



తిరుమలయ్యపల్లెలో రైతులకు యూరియా అందజేస్తున్న రవి, నాయకులు

● వెదురుకుప్పం: వెదురుకుప్పం, కార్వేటినగరం మండలాల్లోని రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులకు అధికార యంత్రాంగంతో పాటు, టీడీపీ నాయకులు హాజరై యూరియాను అందజేశారు. రైతులు హర్షం వ్యక్తం చేశారు.



రైతులకు యూరియా పంపిణీ చేస్తున్న తహశీల్దారు బాబూరాజేంద్రప్రసాద్

● బంగారుపాళ్యం: యూరియా కోసం రైతులు ఇబ్బందులు పడవద్దని మండల వ్యవసాయాధికారి భారతి అన్నారు. మహాసముద్రం రైతు సేవా కేంద్రంలో యూరియాను తహశీల్దారు బాబూరాజేంద్రప్రసాద్ చేతుల మీదుగా రైతులకు పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో ఇప్పటి వరకు 107 టన్నుల యూరియా పంపిణీ చేశామని, మండలానికి ఇంకా 200 టన్నులు ఈ వారంలోపు వస్తుందన్నారు. రైతు సేవా కేంద్రాల్లో యూరియా రైతులకు అందుబాటులో ఉంటుందని, ఎవరూ ఇబ్బందులు పడవద్దని ఆమె సూచించారు.

అంగన్వాడీ కార్యకర్తలకు శిక్షణ



మాట్లాడుతున్న సీడీపీవో వనితశ్రీ

బంగారుపాళ్యం, సెప్టెంబర్ 8(ఆంధ్రజ్యోతి): బంగారుపాళ్యం ఐసీడీఎస్ పరిధిలోని అంగన్వాడీ కార్యకర్తలకు ఒక్క రోజు శిక్షణా కార్యక్రమాన్ని సీడీపీవో వనితశ్రీ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా శిశుసంక్షేమ శాఖ ద్వారా అందించే సేవలను, బేటీ బచావో.. బేటీ పడావో ప్రాముఖ్యత గురించి, బాల్యవివాహాల నిర్మూలన, పిల్లలకు పౌష్టికాహారం, పోక్సో యాక్టుపై వారికి అవగాహన కల్పించారు. అంగన్వాడీ సూపర్‌వైజర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు నగరిలో గంగమ్మ ఊరేగింపు

నింద్ర, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): నగరి పట్టణంలో మంగళవారం సాయంత్రం గంగమ్మ ఊరేగింపు నిర్వహిస్తున్నట్లు జాతర కమిటీ నిర్వాహకులు తెలిపారు. మంగళవారం సాయంత్రం 4 గంటలకు చావడి వద్ద మహాశక్తి శివలింగ దర్శనం, 5 గంటలకు ఓరుగుంటాపురం నుంచి వన దుర్గాదేవి అలంకరణతో ఓరుగుంటాలమ్మ దేశమ్మగుడి నుంచి మహిషాసుర మర్దిని అలంకరణతో బయలుదేరి బస్టాండ్ మీదుగా చావడి వద్దకు చేరనుంది. రాత్రి 10 గంటలకు తలారి వీధి గంగమ్మగుడి వద్ద గంగమ్మ ఊరేగింపు ప్రారంభమవుతుందని, గాండ్ల వీధి, పెరుమాళ్‌గుడి వీధి, రెడ్డివారి సందు మీదుగా గంగమ్మ వేపాకు పందిరి గుడిసె వద్దకు చేరనుందని నిర్వాహకులు తెలిపారు.

నేటి నుంచి కుంభాభిషేక పూజలు

చిత్తూరు కల్చరల్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): నగరంలోని తేనెబండ రోడ్డులో వెలసిన అబిరామి సమేత అమృత లింగేశ్వర స్వామి ఆలయ మహా కుంభాభిషేక పూజలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయని నిర్వాహకులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 9న గ్రామదేవత, విఘ్నేశ్వర, దీప పూజలు, 10న పుణ్యాహవచనం, గణపతి, లక్ష్మి, నవగ్రహ హోమాలు, గోపూజ, నూతన విగ్రహ ప్రతిష్ఠ, ప్రవేశబలి, 11న పూజలు, హోమాలు, మహా కుంభాభిషేకం, కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు అర్చకులు అశోక్‌శర్మ తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ఉత్సవ నిర్వాహకులు ఏకే అన్నపూర్ణమ్మ, సి.శంకర్, ఆనందలక్ష్మి, రాజా, వేణుగోపాల్, అమ్ములు తదితరులు పాల్గొన్నారు.

గ్రహదోష నివారణ పూజలు

చిత్తూరు కల్చరల్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): నగరంలోని పలు శివాలయాల్లో సోమవారం చంద్ర గ్రహణ నివారణ పూజలు జరిగాయి. స్థానిక కామాక్షి అంబికా సమేత చిదంబరేశ్వర, కట్టమంచి కులందేశ్వర, గిరింపేట శివగామి సుందరి చిదంబరేశ్వర, నీవానది సమీపంలోని కాశీ విశాలాక్షి విశ్వేశ్వర ఆలయాల్లో భక్తులు గ్రహణ దోష నివారణ పూజలు చేశారు.

రేపు పెంపుడు కుక్కలకు ఉచిత వైద్య శిబిరం

బంగారుపాళ్యం, సెప్టెంబర్ 8(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన బంగారుపాళ్యం ప్రాంతీయ పశువైద్యశాలలో 10వ తేదీ బుధవారం ఉదయం పెంపుడు కుక్కలకు ఉచిత వైద్యశిబిరం, డాగ్ షో నిర్వహిస్తున్నట్లు అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఆసీఫ్ సోమవారం తెలిపారు. కుక్కలకు రేబిస్, నట్టల నివారణ మందులు ఉచితంగా అందజేస్తామని ఆయన పేర్కొన్నారు. డాగ్ షోలో పాల్గొనే పెంపుడు కుక్కల జాతి, వాటి నిర్వహణపై యాజమానులకు బహుమతులు ప్రదానం చేస్తామన్నారు. పెంపుడు కుక్కల యజమానులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఆదర్శ ప్రాథమిక పాఠశాలకు బీరువా వితరణ



విజయపురం, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీహరిపురం ఆదర్శ పాఠశాలకు సోమవారం పూర్వవిద్యార్థి రాజేంద్రరావు బీరువాను ప్రధానోపాధ్యాయులు వెంకమరాజుకు వితరణగా అందించారు. కార్యక్రమంలో రిటైర్డు ఎంఈవో జయదేవ్ రాజు, ఉపాధ్యాయులు సూరలక్ష్మి, సురేష్, సుజాత, గ్రామస్తులు సురేష్‌రాజు, గజేంద్ర, వినీత పాల్గొన్నారు.